తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శుక్రవారం
21 ఆగస్టు 2026

## బాల్య వివాహాల నిర్మూలనకు వనపర్తి ఆదర్శం: ఎస్పీ



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** బాల్య వివాహాన్ని అడ్డుకోవడం అంటే కేవలం ఒక పెళ్లిని నిలిపివేయడం కాదని, ఒక బాలిక బాల్యాన్ని, విద్యను, ఆరోగ్యాన్ని, కలలను, భవిష్యత్తును కాపాడటమేనని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ అన్నారు. వనపర్తి జిల్లాను బాల్య వివాహాల నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ భవనంలో బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన 54 మంది బాలికలు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలకు దారితీసిన కుటుంబ పరిస్థితులు, ఆర్థిక, సామాజిక కారణాలపై పోలీసు అధికారులు ఇప్పటికే ప్రత్యేకంగా ఆరా తీశారు. వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సైల బృందాలు బాలికల ఇళ్లకు వెళ్లి కుటుంబ పరిస్థితులను పరిశీలించి వివరాలు సేకరించాయి.

**ఈ సందర్భంగా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ...**

బాల్య వివాహం ఆగిపోయిన చోట కథ ముగియదని, అక్కడి నుంచే బాలికకు కొత్త జీవితం ప్రారంభం కావాలని అన్నారు. గత పరిస్థితులు వారి భవిష్యత్తును నిర్ణయించకూడదని, బాలికలు చదువుకోవడంతో పాటు తమకు నచ్చిన నైపుణ్యాలను నేర్చుకుని స్వయం సమృద్ధిగా ఎదగాలని ఆకాంక్షించారు. బాలికలకు తనను ఒక అధికారిగా మాత్రమే కాకుండా అమ్మగా, అక్కగా భావించాలని, వారి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే అండగా ఉంటానని ఎస్పీ భరోసా ఇచ్చారు. బాలికలు తమ కాళ్లపై తాము నిలబడేలా వారికి నచ్చిన నైపుణ్య వృత్తి కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇప్పించి, జీవనోపాధికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు.

*మిగతా 11లో..*

## ముసాయిదా ఓటర్ల జాబితాపై యాక్షన్ ప్లాన్: కలెక్టర్



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్ట్ 20(జనంసాక్షి):** రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్ నగర్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన చర్యలు, నోటీసుల జారీ, పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించిన కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితాలో 6,29,402 మంది ఓటర్లుమహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్ఐఆర్-2026 కింద రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 6,29,402 మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 17, 2026 నాటికి మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను అధికారులు సమీక్షించారు. ముసాయిదా జాబితా ప్రకారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2,13,588 మంది, జడ్చర్లలో 1,99,354 మంది, దేవరకద్రలో 2,16,460 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం సాధారణ ఓటర్లలో 3,13,256 మంది పురుషులు, 3,16,107 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అదనంగా 20 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు నమోదయ్యారు.

**నోటీసులు, తుది జాబితా ప్రక్రియపై దృష్టి...**

ముసాయిదా ఓటర్ల జాబితాలో 40,116 మంది ఓటర్ల నో మ్యాపింగ్ ఉండగా, 1,96,576 లాజికల్ డిస్క్రెపెన్సీలు గుర్తించారు. నియోజక వర్గాల వారీగా మహబూబ్‌నగర్‌లో 19,487, జడ్చర్లలో 8,759, దేవరకద్రలో 11,870 మంది మ్యాపింగ్ పెండింగ్‌లో ఉంది. అదేవిధంగా లాజికల్ డిస్క్రెపెన్సీలు మహబూబ్‌నగర్‌లో 69,951, జడ్చర్లలో 60,961, దేవరకద్రలో 65,664గా నమోదయ్యాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. బీఎల్‌ఓల నియామకం, డేటా అప్‌డేషన్ పూర్తి చేయాలనీ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో గతంలో 846 మంది బీఎల్‌ఓలు/పీఎస్ సిబ్బంది ఉండగా, కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో ఈ సంఖ్య 862కు చేరింది. ఈఆర్‌ఓ లను బియల్ ఓ ల ట్రైనింగ్ కోసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీలు, బీఎల్‌ఓల అప్‌డేషన్, సమావేశాల మినిట్స్‌ను త్వరితగతిన పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్‌డీఓ నవీన్, ఎలక్షన్ డిటి అధికారి జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ పాల్గొన్నారు.

## నాగనూల్ కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థినుల 100 శాతం హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్‌తో కలిసి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థినుల హాజరు, విద్యా బోధన, పరిశుభ్రత, తాగునీరు, స్టోర్‌రూమ్, వంట గది, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.

హాజరు రిజిస్టర్లను పరిశీలించగా 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 317 మంది విద్యార్థినులు నమోదై ఉండగా, గురువారం 229 మంది మాత్రమే హాజరైనట్లు గుర్తించారు. గైర్హాజరైన విద్యార్థినుల వివరాలను తెలుసుకున్న కలెక్టర్ పాఠశాలలో 100 శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆదేశించారు. తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థినుల కారణాలను తెలుసుకుని, అవసరమైతే తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఆరోగ్య సమస్యలతో దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, విద్యార్థినులు చదువుకునే ప్రదేశాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. స్టోర్‌రూమ్‌లోని సరుకులు, నిత్యావసర వస్తువులను సక్రమంగా భద్రపరచడంతో పాటు స్టాక్ వివరాలు, రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.


ఆర్వో ప్లాంట్‌లో లీకేజీని గుర్తించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్య లేకుండా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పాఠశాలలోని చిన్నచిన్న మరమ్మతులను కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, మౌలిక వసతుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రత, వంటకు ఉపయోగించే సరుకులు, వాటి నిల్వ విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నిర్ణీత సమయానికి నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించాలని సూచించారు. వంట సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

పదో తరగతి తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో ముచ్చటించి వారి చదువు, పాఠ్యాంశాలపై అవగాహన, ఉపాధ్యాయుల బోధన, పరీక్షల సన్నద్ధతను తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాల కోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. రోజువారీ పాఠాలను పునశ్చరణ చేసుకోవడంతో పాటు అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేందుకు కష్టపడాలని ప్రోత్సహించారు.

ప్రతి విద్యార్థినిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఉపాధ్యాయుల బాధ్యతని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థినుల సామర్థ్యానికి అనుగుణంగా మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థినుల కోసం నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించిన ఆయన పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనుల వల్ల విద్యాభ్యాసానికి ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ మండల విద్యాధికారి కురుమయ్య, ఇన్‌చార్జి జీసీడీఓ నిర్మల, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న, ఉపా ధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ఇక ప్రభుత్వ పరంగా
## పండుగ సాయన్న జయంతి, వర్ధంతి అధికారిక ప్రకటన



**నారాయణపేట, ఆగస్టు 20(జనంసాక్షి):** తెలంగాణ రాబిన్‌వుడ్‌గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీచేసింది. పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఇటీవలరాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారి శ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజనశాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో ముదిరాజ్ సంఘల ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో ప్రభుత్వం తాజాగా అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. జీవో ప్రకారం ఇకపై ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతి, డిసెంబర్ 10న పండుగ సాయన్న వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ నిర్ణయంపై మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పండుగ సాయన్న వంటి వీరుడి పోరాటాన్ని, త్యాగాన్ని ప్రజా ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం బహుజన సమాజానికి గర్వకారణమని అన్నారు.

### ఆగస్టు 23 చలో హైదరాబాద్
## బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



**అయిజ, ఆగస్టు 20 (జనంసాక్షి):** పాత పెన్షన్ విధానం ఉద్యోగుల జీవిత చరమాంకంలో ఆర్థిక భరోసాను కల్పిస్తుందని అయిజ ఎమ్మార్వో జ్యోతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ అయిజ మండల శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభ పోస్టర్లను స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో శ్రీమతి జ్యోతి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మార్వో జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు 30-40 సంవత్సరాల పాటు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారని అన్నారు.

*మిగతా 10లో..*

# ఆహార ధాన్యాల గోదాము నిర్మాణానికి శంకుస్థాపన: డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**పెద్ద శంకరంపేట, ఆగస్ట్ 20 (జనంసాక్షి):** ముందుగా గౌరవ ఎమ్మెల్యే గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ఆలయం శ్రీ కోటమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శంకరంపేట్ (ఎ) మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం (MGNRE GS) నిధులు రూ. 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వ భవనం (గోదాం) నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.





**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ...**

రైతులకు సౌకర్యం, రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఈ గోదాము ఎంతో ఉపయోగపడు తుందని, వర్షాలు లేదా ఇతర ప్రతికూల పరిస్థితుల్లో ధాన్యం పాడవకుండా రక్షణ లభిస్తుందని తెలిపారు. నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ గౌడ్,స్థానిక ప్రజాప్రతినిధులు, మండలానికి సంబంధించిన సర్పంచులు, ఎంపీడీవో క్రాంతి కమార్, నారా గౌడ్, మురళి పంతులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు బూరుగుపల్లి గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా వసతులు, ప్రజల భద్రతకు పెద్దపీట: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**జిన్నారం, ఆగస్టు 20 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మంత్రికుంట, చెట్లపోతారం ప్రాంతాల్లో రూ.47.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఖాజి పల్లి గ్రామంలో రూ.13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై





నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను కేటాయించిన కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు.

ప్రభుత్వంతో పాటు పరిశ్రమల సహకారంతో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహ, ప్రకాష్ చారి, సురేందర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్ కస్తూర్బా గురుకులానికి త్వరలో ప్రత్యేకాధికారిణి..?



**న్యాల్‌కల్, ఆగస్టు 20 (జనంసాక్షి):** గత 20 రోజులకు పైగా ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ) లేకుండానే కొనసాగు తున్న.. న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల కు అతి త్వరలోనే ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ)ను నియ మించేందుకు జిల్లా విద్యాధికారిణి, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల జిల్లా జీసిడీఓ చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ)గా విధులు నిర్వహించిన రుబీనా పర్వీన్ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా (రిజైన్) విధుల నుండి తప్పుకుండా విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇన్చార్జి ఎస్ఓగా విధులు నిర్వహించేందుకు లిఖిత పూర్వకంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో.. ఓ సీనియర్ ఉపాధ్యాయురాలు ఇన్చార్జి ఎస్ఓ గా కొనసాగుతున్నారు. గురుకులంలోని బాలికలకు మెరుగైన విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, గురుకులం నిర్వహణ, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారులు అతి త్వరలోనే స్థానిక గురుకులానికి ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ)ను నియమించనున్నట్లు సమాచారం.

## దారుణ హత్యకు గురైన మహిళా అడ్రాస్ దొరికింది

**రాజాపూర్, ఆగస్టు 20(జనంసాక్షీ):** మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామ శివారులో జాతీయ రహదారి 44 పక్కన దారుణ హత్యకు గురై విగత జీవిగా పడి ఉన్న మహిళా మృత దేహం మహబూబ్ నగర్ మార్చురీకి బుధవారం తరలించిన విషయం తెలిసిందే. ఆచూకీ కోసం పోలీసులు ఇచ్చిన మొబైల్ నంబర్లకు సంబంధిత వ్యక్తులు ఫోన్ చేయడంతో మృతురాలు వనపర్తి జిల్లా ఏదుల మండలం , సింగాయపల్లి తాండకు చెందిన జాటవత్ లాలి w/o చందుగా గుర్తించారు. ఆమే బాలానగర్ మండల కేంద్రంలో ఒంటరిగా ఉంటు మేస్త్రి పనికి కూలీకి వెళ్ళేదని సమాచారం.



## కొత్త రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ



**గుండుమాల్, ఆగస్ట్ 20 (జనంసాక్షి):** గుండిమాల్ మండలంలోని ముదిరెడ్డి పల్లి గ్రామపంచాయతీలో ముఖ్య అతిథిగా గుండుమాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకిరెడ్డి విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త రేషన్ స్మార్ట్ కార్డ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. రేషన్ కార్డుల పంపిణీలో పారదర్శకత పెంచడం, నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేయడం, లబ్ధిదారుల వివరాలను సులభంగా గుర్తించడం ఈ స్మార్ట్ కార్డుల ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. అర్హులైన కుటుంబాలు తమ కార్డు వివరాలను సంబంధిత పౌరసరఫరాల శాఖ కార్యాలయం లేదా రేషన్ దుకాణం వద్ద తెలుసుకోవచ్చు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బందేరి దేవమ్మ కృష్ణయ్య ఉపసర్పంచ్ బేగరి సత్యమ్మ భీమయ్య డీలర్ రాఘవేందర్ రెడ్డి వార్డు సభ్యులు ఎర్ర హనుమంతు, బోయ మాసప్ప, కుర్వ రాములు, చెక్కబుగ్గప్ప, గుడిసె అంజమ్మ, చిన్న కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోస్గి నారాయణరెడ్డి, మరియు రాజశేఖర్ రెడ్డి, బెక్కర శేఖర్ రెడ్డి, బిక్కరి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సంఘం మహిళా అధ్యక్షురాలు బోయ సావిత్రి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్తయ్య, గ్రామ జిపిఓ పద్మ, అంగన్వాడీ టీచర్ రాములమ్మ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వరిగుంతం గ్రామంలో ఉచిత రక్త పరీక్షలు

- గ్రామ సర్పంచ్ పుట్లగల్ల మోహన్ ఆధ్వర్యంలో...



**కొల్చారం, ఆగస్టు 20 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని వరి గుంతం గ్రామ సర్పంచ్ పుట్లగళ్ల మోహన్ ఆధ్వర్యంలో గురువారం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది గ్రామంలో జనరల్ రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి. ప్రవీణ, అంగన్ వాడీ సిబ్బంది చంద్రకళ, కవిత, సువర్ణ, పీహెచ్ఎఫ్ఐ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వనమాల శ్రీదేవి, పంచాయతీ కార్మికులు లక్ష్మయ్య, పెంటయ్య, అనిల్, నర్సింలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తామర పువ్వుల కోసం వెళ్లి... చెరువులో నీట మునిగి యువకుడి మృతి..



**పెద్ద శంకరంపేట్, ఆగస్టు 20 (జనం సాక్షి):** తామర పువ్వుల కోసం వెళ్లి.. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని బుజరాన్ పల్లి చెరువులో నీట మునిగి యువకుడు మృతి చెందిన గురువారం చోటు చేసుకుంది. పెద్ద శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పేట మండల పరిధి లోని బుజరాన్ పల్లి గ్రామానికి చెందిన అంజయ్య (19) బుజరాన్ పల్లి చెరువులో ఉదయం 8 గంటల ప్రాంతంలో తామర పూల కోసం చెరువులోకి దిగాడు అన్నారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతి చెందాడని పేర్కొన్నారు. చెరువులో దిగిన సమయంలో తామర తీగలు చుట్టుకోవడంతో చెరువులోని నీట మునిగి మృతి చెందాడు అన్నారు.. మృతుడి భార్య పల్లె బోయిన భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## టీయూడబ్ల్యూజే హెచ్-143 మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**మిడ్జిల్, ఆగస్టు20 (జనంసాక్షి):**
టీయూడబ్ల్యూజే (హెచ్-143) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో-కన్వీనర్ చింతకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ప్రకటించారు.

**నూతన కమిటీ పదవులు:**
అధ్యక్షుడు - బాల్ రెడ్డి (సాక్షి), ప్రధాన కార్యదర్శి - శ్రీనివాసులు (దిశా), ఉపాధ్యక్షుడు - భీమ్ రాజ్ (జనంసాక్షి), కోశాధికారి - బాల నారాయణ (నేటి దర్శిని), సంయుక్త కార్యదర్శి - వరుణ్ (నమస్తే తెలంగాణ), ప్రచార కార్యదర్శి - ఎర్రోళ్ల మల్లేష్ (వెలుగు)

**కార్యనిర్వాహక సభ్యులు:**
సి రాఘవేందర్( మనం) రమేష్, (మెట్రో ఈవినింగ్ ) రవీందర్ రెడ్డి (గిరిజన సంస్కృతి) కార్యక్రమంలో జిల్లా నరేందర్ చారి, నరేందర్ గౌడ్, కృష్ణ యాదవ్ తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. అంతకుముందు ముందు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల సభ్యులకు యూనియన్ సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన మిడ్జిల్ మండల కమిటీకి అడ్‌హక్ కమిటీ నాయకులకు. అభినందనలతెలియజేస్తూ, పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు, సంఘ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిడ్జిల్ మండల పాత్రికేయులు పాల్గొన్నారు.



## గాగిల్లాపూర్‌లో ఘనంగా వన మహోత్సవం

- ప్రతి ఇంటికి ఐదు మొక్కల పంపిణీ
- మొక్కలు నాటడమే కాదు..పరిరక్షించాలి
- సర్పంచ్ ఎర్రల జానకిరాజు

**బెజ్జంకి,ఆగస్టు 20(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం-2026 కార్యక్రమంలో భాగంగా గాగిల్లాపూర్ గ్రామంలో గురువారం సర్పంచ్ ఎర్రల జానకిరాజు ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని ప్రతి ఇంటికి ఐదు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు ప్రజాప్రతినిధులు,అధికారులు మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాము రాజేంద్రప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ బుర్ర రాములుతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకం స్వయం ఉపాధికి మార్గం: కలెక్టర్ ప్రతిమా సింగ్

**హవేలీ ఘన్పూర్ మండలం, ఆగస్టు 20 (జనంసాక్షి):** గురువారం హవేలీ ఘన్‌పూర్ బోగడ భూపతిపూర్ గ్రామంలో రైతు జైపాల్ రెడ్డి పొలంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతుల తేనెటీగల పెంపకాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదిమంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులు అందజేయడం జరిగిందని 40% సబ్సిడీ, 60 శాతం లబ్ధిదారుల వాటాతో ఈ తేనె తీగల పెంపకం కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఒక బాక్సు తేనెటీగల పెంపకానికి 6,000 రూపాయలు ఖర్చుకాగ అందులో ఉద్యానవన శాఖ సబ్సిడీ 2,400 ఉంటుందని, లబ్ధిదారిన వాటా 3,600 చెల్లించాల్సి ఉంటుందన్నారు 15 రోజుల వ్యవధిలో ఒక బాక్స్ తేనెటీగల పెంపకం ద్వారా మూడు కిలోల తేనె ఉత్పత్తి కాగా ఒక కేజీకి 600 చొప్పున 1800 రూపాయల నికర ఆదాయం వస్తుందని. 104 బాక్సుల ద్వారా 10 మంది రైతులకు 312 కేజీల తేనె ఉత్పత్తి ద్వారా ఒక నెలకు 1,87,200 ఆదాయం చేకూరుతుందన్నారు. జిల్లా ఉద్యానవన



శాఖ ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. కొండతెర, కొండిలేని, ఐరోపా, పుట్ట, విసినకర్ర తేనెటీగలు వంటి రకాలు ఆర్థిక ప్రాముఖ్యను అందిస్తాయని స్పష్టం చేశారు. తేనెటీగల పెంపకం నైపుణ్యత గల పరిపూర్ణ అనే వ్యక్తి ద్వారా సంపూర్ణ అవగాహన చేసుకుని పెంపకంలో మేలుకోలు తెలుసుకుని భవిష్యత్తులో ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయ సాగు పంటతోపాటు అనుబంధ రంగాల్లో పట్టు సాధించాలన్నారు. వ్యయసాయ అనుబంధ పద్ధతుల్లో భాగంగా శాస్త్రీయంగా తేనెటీగల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ తీసుకుంటున్న చొరవ ను కొనియాడారు.



ఈ పెంపకంలో రైతులు ఉద్యాన పంటలో ఉత్పాదకతను పెంచి ఆదాయంతోపాటు అదనపు ఉపాధి అందుతుందన్నారు. దేశంలోనే తేనెటీగల ఉపయోగాలు వాటి మనుగడలను ప్రాచీన కాలంలోనే గుర్తించినట్లు తెలిపారు. తేనెటీగల పెంపకం అనేది రైతు లకు పంట అధిక సాగు, రైతులకు ఎంతగానో ఆర్థికంగా లాభం చేకూరుస్తుందన్నారు. రైతులు ఆర్థిక స్వాలంభనకు కృషిచేసి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, స్థానిక సర్పంచ్ పోశెట్టి సంబంధిత రైతులు తదితరులు పాల్గొన్నారు

## పెద్ద శంకరంపేటలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 20 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ గారి జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ...**

భారతదేశాన్ని ఆధునిక యుగం వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. నేడు దేశంలో యువత అనుభవిస్తున్న టెలికాం, కంప్యూటర్, ఐటీ విప్లవానికి నాంది పలికిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను దేశ రాజకీయాల్లో భాగస్వాములను



చేసిన మహోన్నత నాయకుడని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని, ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దానంపల్లి నారాగౌడ్,, మురళి పంతులు, RN సంతోష్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమళ్ళ గౌడ్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ (NSUI) బాధ్యులు వివిధ గ్రామాల సర్పంచులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నీటి లభ్యత ప్రకారం పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలి

- వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి
- మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ రెడ్డి




**జగదేవ్ పూర్, ఆగస్టు 20 (జనంసాక్షి):**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యత ప్రకారం పంటల సాగుకు ప్రణాళికలను రూపొందించుకోవాలని జగదేవ్ పూర్ మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎల్ నినో ప్రభావం – ప్రత్యామ్నాయ పంటల సాగుపై గురువారం మండల కేంద్రమైన జగదేవ్ పూర్ లో స్థానిక రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ అక్టోబర్ మాసాల్లో, వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవా ల్సిన అవసరం ఉందని చెప్పారు. నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను పరిగణలోకి తీసుకొని ఆయిల్ ఫామ్ , కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదం, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కూరగాయలు వంటి పంటలను సాగు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు అధికారుల సూచనలను పాటిస్తూ నీటి వనరులను సంరక్షించడంతోపాటు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి సుస్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఫామ్ పాండుల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి...**

అలాగే వర్షపు నీటిని పొలంలోనే నిల్వ చేసుకునేందుకు వీలుగా ఫామ్ పాండ్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పరిమిత నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రైతులు తమ ఆదాయాన్ని కూడా పెంచుకునే అవకాశ ముందని స్పష్టం చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు పద్ధతులపై రైతులకు వివరించారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, నీటి సంరక్షణకు అందుబాటులో ఉన్న అవకాశాలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎంపివో ఖాజా మొహిద్దీన్, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్ శర్మ, మైనర్ ఇరిగేషన్ ఏ ఈ సిద్ధార్థ్, పశువైద్యాధికారి శ్వేత, ఏపీవో సుధాకర్, వి బి జి రామ్‌జీ, పలువురు సర్పంచులు, ఏఈవోల తోపాటు సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ఆర్ ఎ డబ్ల్యూ ఈ పి విద్యార్థులు మండల రైతులు పాల్గొన్నారు.

## నంగునూరు ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

**నంగునూరు మండలం, ఆగస్టు 20 (జనంసాక్షి):** నంగునూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెద్దపల్లి మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా



విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై నంగునూరు ఎంపీడీ వోగా నియమితులయ్యారు. గురువారం నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో పరిచయం చేసుకున్న ఆయన మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని శ్రీనివాస్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకారం అవసరమని, అందరి సమన్వయంతో నంగునూరు మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొని నూతన ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్పిల్ ఆధారిత రైతు శిక్షణపై అవగాహన సదస్సు

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 20 (జనంసాక్షి):**

గురువారం రోజు పెద్ద శంకరంపేటలో తెలంగాణ ప్రభుత్వము వ్యవసాయ శాఖ ఆత్మ సౌజన్యంతో ఆర్పిఎల్ ఆధారిత రైతు శిక్షణ కార్యక్రమం రైతులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుల



నుండి ప్రశ్నావళి రూపంలో వారికి ఎంత వరకు అవగాహన ఉందో తెలుసుకొని సమగ్ర వ్యవసాయం, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం మరియు మంచి వ్యవసాయ పద్ధతులను పాటించడంపై అవగాహన చేయడం జరిగింది అలాగే తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారము 7 సన్న రకాల వరి రకాలైనటువంటి వరి విత్తనాలు వాటి ఆవశ్యకత గురించి వివరించడం జరిగింది . నానో యూరియా నానో డీఏపీల ఉపయోగాలు పై సమగ్ర వివరణ చేయడం జరిగింది. తక్కువ నీటితో పండే వరికి ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన వివరించడం జరిగింది రైతులకు. ఎరువుల ఆప్ FFS యాప్ల (apps) డెమో చూపించడం జరిగింది.

అలాగే రెండవ రోజు రైతు శిక్షణ కార్యక్రమం రేపు రైతు వేదికలో రైతులకు అవగాహన శాస్త్రవేత్త ద్వారా వివరించడం జరుగుతుందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ఆత్మ బిటిఎం కిరణ్ విస్తరణ అధికారులు అఖిల్ వినీత్ సంరిన్ బద్దారం గ్రామ సర్పంచ్ ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ ఏజెన్సీలను రద్దు చేయాలి

- కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను ప్రభుత్వం ద్వారానే నియమించాలి
- మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి డిమాండ్
- కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన
- అదనపు కలెక్టర్‌కు వినతి





**సంగారెడ్డి, ఆగస్టు 20 (జనంసాక్షి):** కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులలో అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వం ద్వారానే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం.

ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూలి జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్లో నోటిఫికేషన్ లేకుండా ఏజెన్సీలు తన ఇష్టానుసారంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో అక్రమాలకు పాల్పడ్డా ఇప్పటివరకు ఏజెన్సీలపైన ప్రభుత్వము చర్యలు తీసుకోక పోవడం కారణమేంటని అన్నారు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగాలలో ఎన్ని అక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వ మాత్రం పట్టించుకోక పోవడం చాలా దారుణమని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఒక్క 197 పోస్టులలో అక్రమాలకు నిలయంగా ప్రభుత్వ ఉద్యోగులు తయారయ్యారు తప్ప ఇంకోటి కాదని అన్నారు ఒక్కొక్క ఉద్యోగానికి 3 లక్షల నుండి 5 లక్షల రూపాయలు తీసుకొని వాళ్లకు ఆర్డర్ కాపీలు ఇస్తున్నారు తప్ప నిజమైన లబ్ధిదారులకు మాత్రం ఉద్యోగాలు రావడం లేదని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరు మీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు. అందులో పనిచేస్తున్న అధికారులు ఎవరికి చెప్పకుండా ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని అన్నారు కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని తొలగించి వారి స్థానంలో అందులో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో కార్మికులందరూ ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, యాదగిరి, శోభ సునీత, లక్ష్మీ ప్రియ, భాగ్య లక్ష్మి నాగరాజు, శేఖర్, మల్లేశం, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** వంగూరు మండలంలోని వంగూరు, పోల్కంపల్లి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్.. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనుల్లో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణానికి వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మ్యాప్, డిజైన్, నిర్మాణ ప్రణాళిక ప్రకారమే పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నిర్మాణ దశలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి పనులను చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగం పెంచి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించడమే తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల భవనాలు ఆకర్షణీయంగా ఉండటంతో పాటు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని, పనుల వేగంతో పాటు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమోదించిన ప్రణాళిక ప్రకారం అన్ని పనులను పూర్తిచేసి విద్యార్థులకు నాణ్యమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, ఈడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్ అధికారులు, వంగూరు తహసీల్దార్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన రాజీవ్ గాంధీ

- డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



**మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్ట్ 20(జనంసాక్షి):** ఆధునిక భారత నిర్మాణానికి మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ పునాదులు వేశారని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అశోక్ టాకీస్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతిక, సమాచార విప్లవానికి నాంది పలికి, యువతకు కొత్త అవకాశాలను కల్పించినట్లు గుర్తు చేశారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయన ఆశయాలు, దేశ అభివృద్ధి కోసం చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని అన్నారు. కార్యక్రమంలో మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రకుమార్ గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ సిజే బెనహర్, నాయకులు వినోద్ కుమార్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, సాయిబాబా, పరమేష్, కలీం, అవేజ్ , గులాం జహీర్, మహేందర్, ప్రతాప్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, కార్పొరేటర్లు సీజే పూజిత, ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షులు మహేందర్, లక్ష్మారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు గోనెల శ్రీనివాస్, టీసీ శ్రీనివాస్, నాయకులు అబ్దుల్లా, కంచిమి లక్ష్మణ్, కోట్ల చంద్రయ్య, మురళీ గౌడ్, బ్యాగరి వెంకట స్వామి, రియాజుద్దీన్, అబ్రార్, హరినాథ్, వెంకటలక్ష్మి, ఉషారాణి, గంగిరెడ్డి, జబీద్, అక్బర్, గంజి అంజనేయులు, ముస్తాక్ అలీ, ఆశు, జగదీష్, పీర్ సాదిక్, రామచందర్, మాసన్న, కృష్ణయ్య,శేఖర్ రెడ్డి, వినయ్ కుమార్, వడ్ల రాకేష్, గాయకుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం

- ఏఐసీసీ పరిశీలకులు దీపక్ రాథోడ్
- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





**నారాయణఖేడ్, ఆగస్టు 20 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని, క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ పరిశీలకులు దీపక్ రాథోడ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లో గురువారం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు డాక్టర్ రియాజ్, దుద్దిళ్ల శ్రీనుబాబు, మున్సిపల్ చైర్పన్ నగేష్ కుమార్ శెట్కర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా దీపక్ రాథోడ్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ..**

పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తకు గౌరవం, ప్రతి నాయకుడికి బాధ్యత, అన్ని స్థాయిల్లో సమన్వయం ఉంటేనే కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నాయకులు, కార్యకర్తలు ముందుండాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటరత్నపూర్‌లో బోనాల ఉత్సవంలో పాల్గొన్న మైపాల్ రెడ్డి



**తూప్రాన్, ఆగస్టు 20(జనంసాక్షి):** అమ్మవారు అందరిని చల్లగా చూడాలని కోరుకుంటున్నాట్లు రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి తెలిపారు మండలంలోని వెంకటరత్నపూర్ గ్రామంలో బోనాల ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గరిగె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి పీహెచ్‌సీకి సిబ్బంది కరువు!

- జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారికి వినతి పత్రం అందజేత
- బెజ్జంకి లో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి: సీపీఎం డిమాండ్



**బెజ్జంకి,ఆగస్టు 20(జనంసాక్షి):** బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సిబ్బంది కొరతను వెంటనే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బెజ్జంకి పీహెచ్‌సీ 24 గంటల వైద్య సేవలు అందించే కేంద్రంగా ఉన్నప్పటికీ, ఒక్క స్టాఫ్ నర్స్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉందని,సూపర్‌వైజర్ పోస్టును భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఆరుగురు ఏఎన్ఎంలు అవసరం ఉండగా ప్రస్తుతం ఇద్దరే ఉన్నారని పేర్కొన్నారు. ఆయుష్ విభాగానికి చెందిన సిబ్బందిని సైతం సిద్దిపేటకు డిప్యూటేషన్‌పై పంపడంతో వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి పీహెచ్‌సీని పూర్తిస్థాయి సిబ్బందితో బలోపేతం చేయాలని కోరారు. బెజ్జంకి మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని,మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెండు 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులు భరించలేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మనస్సును నిచ్చలంగా ఉంచుకోవాలి.. కష్ట-సుఖాల్లో కూడా భగవంతుణ్ణి స్మరించాలి...

• శ్రీ బసవ మహంత స్వామిజి




జహీరాబాద్, ఆగస్టు 20(జనంసాక్షి): మనస్సును నిచ్చలంగా వుంచుకుంటేనే మనిషి జీవితం సార్థకమవుతుంది అని బసవ మహంత స్వామిజి అన్నారు.శ్రావణమాసాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణ వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బసవా ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్న శరణ తత్వ ప్రవచన మహోత్సవాలు ఏడవ రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా పరమ పూజ శ్రీ మహంత స్వామిజి మాట్లాడుతూ మన్సస్సు కూడా గాలి, కరెంట్ లాగా కనపడవు,కానీ గాలిలేనిదే ఎ జీవి కూడా బ్రతుకలేదు. అదేవిదంగా మనిషి మన్సుకూడ అలాంటిదే. మనస్సును ఎవరైతే తన అదుపులో పెట్టుకుంటారో వారు జీవితంలో ఏదైనా సందించగలరు ,వారి జీవితం సార్థకత చెందుతుంది అని అన్నారు. తన స్వార్థం కోసం కాకుండా భక్తి కోసం భగవంతుణ్ణి ప్రార్తించాలన్నారు.అనంతరం అన్నప్రసాద దాతలు చంద్రశేఖర్ ,పసారి సూర్యప్రకాష్, సంజయ్ కుమార్ నాగూర్‌లకు అయన శాలువా ,పూల దండలతో సత్కరించారు. కార్యక్రమానికి వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ షెట్కార్, కార్యదర్శి రేకుల్గి సుభాష్ సమాజ పెద్దలు మడపతి బస్వరాజ్ ,సంగప్ప ,బెండి శేఖర్,బండప్పమజ్జిగ కిరణ్ కుమార్ ,ఉల్లిగడ్డ శేఖర్,మాణిక్ ప్రభు రాజు భక్తులు, మహిళా భక్తులు, శరణులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామీజీ ప్రవచనాలను ఆలకించారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం కేసులో.. బీజేపీ శ్రేణులకు ఊరట..!

• కేసు కొట్టివేతతో హర్షం వ్యక్తం చేసిన బాధితులు



న్యాల్ కల్, ఆగస్టు 20 (జనంసాక్షి): బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం కేసులో ఆరోపణలను ఎదుర్కొన్న పలువురు బీజెపి శ్రేణులకు ఎట్టకేలకు ఊరట లభించింది. గత ఎనిమిది సంవత్సరాల క్రితం న్యాల్ కల్ మండలం, హద్నూర్ పోలీసులు న్యాల్ కల్, జహీరాబాద్ ప్రాంతానికి చెందిన పలువురు భాజపా శ్రేణులపై అప్పట్లో కేసు నమోదు చేశారు. పోలీసులు పెట్టిన కేసును వ్యతిరేకిస్తూ.. పార్టీ శ్రేణులు కోర్టును ఆశ్రయించారు. ఎట్టకేలకు ఎనిమిది సంవత్సరాల అనంతరం గురువారం బాజప శ్రేణులపై పెట్టిన కేసును కొట్టివేయడంతో ఆరోపణలు ఎదుర్కొన్న ముద్దాయిలు కోర్టు తీర్పును గౌరవిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసును కొట్టివేయడం పట్ల బాధితులు మల్లికార్జున్, అశోక్, మల్లేష్, గంగువార్, సుధీర్ బండారి, శ్రీకాంత్, వీరేష్, వీరన్న, ఆనందీశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

## మెదక్ టౌన్ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడిగా మహ్మద్ ఫాజిల్




మెదక్ టౌన్, ఆగస్టు 20 (జనంసాక్షి): మెదక్ టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మహ్మద్ ఫాజిల్‌కు మెదక్ టౌన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఫాజిల్‌కు పార్టీ కండువా కప్పి అభినందించగా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. అంజనేయులు గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచే రాజకీయాల్లో కొనసాగుతున్న ఫాజిల్ గతంలో బీఆర్ఎస్‌లో చురుకుగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రోహిత్ రావు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం కొన్ని నెలల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మైనారిటీ వర్గాలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే రోహిత్ రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంజనేయులు గౌడ్‌తో పాటు పార్టీ నాయకులకు ఫాజిల్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మెదక్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. మైనారిటీ ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పార్టీ నాయకత్వం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఫాజిల్ స్పష్టం చేశారు.

## ఆయిల్‌పామ్ తోటను సందర్శించిన సురేంద్ర మోహన్

నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 20(జనంసాక్షి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ నారాయణపేట జిల్లా నార్వా మండల కేంద్రంలోని కుమార్లింగంపల్లి గ్రామంలో రైతు గోపాల్ రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతు గోపాల్ రెడ్డి తో ముఖ్య కార్యదర్శి మాట్లాడి, ఆయిల్‌పామ్ సాగులో ఆయన అనుభవాలు, సాగు విధానం, దిగుబడులు, ఆదాయం తదితర వివరాలను తెలుసుకున్నారు. రైతు గోపాల్ రెడ్డి 2022 సంవత్సరంలో తన 8 ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ తోటను ఏర్పాటు చేసుకున్నారు. గత సంవత్సరం నుండి తోటలో దిగుబడి ప్రారంభమై, సుమారు 40 టన్నుల దిగుబడిని పొందడంతో రూ.6.80 లక్షల ఆదాయం సాధించినట్లు తెలిపారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతు సాధించిన ఆదాయంపై ముఖ్య కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్ ఐఏఎస్ గారు సంతోషం వ్యక్తం చేసి, రైతును అభినందించారు. అలాగే కుమార్లింగంపల్లి గ్రామంలోని ఇతర ఆయిల్‌పామ్ రైతులతో కూడా మాట్లాడి, ఆయిల్‌పామ్ సాగు ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ తోట నుంచే వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో ఫోన్‌లో మాట్లాడారు. రైతులతో మంత్రిగారిని మాట్లాడించి,



ఆయిల్‌పామ్ సాగు ద్వారా తాము పొందుతున్న లాభాలు, తమ అనుభవాలను రైతులు మంత్రిగారితో పంచుకున్నారు.

రైతులను ఆయిల్‌పామ్ సాగువైపు మరింతగా ప్రోత్సహిస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సాయిబాబా, మక్తల్ నియోజకవర్గ ఉద్యాన అధికారి రామకృష్ణ, జిల్లా ఆయిల్‌ఫెడ్ మేనేజర్ రాధాకృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారులు జనార్ధన్, లింగరాజ్, ఫయాజ్, ఈశ్వర్ తదితర అధికారులు అలాగే కుమార్లింగంపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది ఆయిల్‌పామ్ రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలకు 36 మంది ఎంపిక

• మక్తల్‌లో ఘనంగా ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు



మక్తల్, ఆగస్టు 20 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. మల్లారెడ్డి, బి. విజయ కాంతారావు ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో గురువారం మక్తల్ ఎల్లమ్మకుంట-కొత్త గార్లపల్లి రోడ్డులో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను నిర్వహించారు.

18 సంవత్సరాల లోపు బాలబాలికలకు నిర్వహించిన 1000 మీటర్ల ట్రాక్ సైక్లింగ్, 10 కిలోమీటర్ల రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీలను జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచి మొత్తం 76 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.

బాలికల విభాగంలో చైతన్యశ్రీ (యాంకి) ప్రథమ స్థానం, దీక్ష (వనపర్తి), వైష్ణవి (గుడిగండ్ల) ద్వితీయ స్థానాలు, స్వాతి (చిన్నచింతకుంట) నాల్గవ స్థానంలో నిలిచారు.

బాలుర విభాగంలో వినయ్ (ఎడవల్లి) ప్రథమ స్థానం, బోయ వెంకటేష్ (మక్తల్) ద్వితీయ స్థానం, పతిలావత్ సిద్ధార్ద్ (రేకులపల్లి తండా) తృతీయ స్థానం సాధించారు.

ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 36 మంది బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బి. గోపాలం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే 1000 మీటర్ల ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో, అలాగే ఈ నెల 23న హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో జరిగే 10 కిలోమీటర్ల రాష్ట్రస్థాయి రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఈ సైక్లింగ్ పోటీలలో నర్వ బాలికల గురుకుల పాఠశాల నుంచి 30 మంది విద్యార్థినులు పాల్గొనేలా ప్రోత్సహించినందుకు గాను పాఠశాల పీడీ అవంతిని బి. గోపాలం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి. శివకుమార్, పీడీ అవంతి, గూరకొండ శ్రీనివాసులు, పి. శరత్, గోపి, నీలి యాదగిరి, వినయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపురంకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సెంటర్ మంజూరు

• గురువారం డిఇఓచేతుల మీదుగా ప్రారంభం - పోస్టర్ ఆవిష్కరణ



శ్రీరంగాపురం, ఆగస్టు 20 (జనంసాక్షి): శ్రీరంగాపురం మండల కేంద్రానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ టి ఓ ఎస్ ఎస్ ఏఐ సెంటర్ మంజూరు అయింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి హనుమంతు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, బాలికల మరియు బాలుర ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మరియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ, మండల కేంద్రానికి ఓపెన్ స్కూల్ సెంటర్ ను మంజూరు చేసిన ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు. ఈ సెంటర్ ను డిఇఓ సోమవారం అధికారికంగా ప్రారంభించనున్నారు"బి అని తెలిపారు.

మండలంలోని, పరిసర ప్రాంతాల్లో చదువు మధ్యలో ఆపేసిన వారు, డ్రాప్ అవుట్ అయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి మండలంలోని మేధావులు, వివిధ సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు,అధికారులుతోడ్పాటునందించాలని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు, యు టి ఎఫ్, టి పి యు ఎస్, ఎస్ టి యు, టి పి ఆర్ టి యు, నాయకులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫారం పాండ్లతో భూగర్భ జలాల పెంపు: కలెక్టర్ ఆదర్శ్ సురభి

- వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీటిని అందుబాటులో ఉంచేందుకు ఫారం పాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లాలో ఫారం పాండ్ల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గురువారం పానగల్ మండలం గోప్లాపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఫారం పాండ్ నిర్మించుకుంటున్న రైతు పల్లవితో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో రెండు గుంటల విస్తీర్ణంలో ఫారం పాండ్ నిర్మిస్తున్నట్లు రైతు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెంపు, బోర్ల రీచార్జ్, వ్యవసాయ అవసరాలకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం పాండ్ నిర్మాణంపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి మరిన్ని పాండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఫారం పాండ్ల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన ఫారం పాండ్ల నిర్మాణ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండి వేరుశెనగ, పెసర, కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటి కొరతతో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడంతో పాటు రైతులు ఆదాయాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

**పాఠశాలలో వంటగది పరిశీలన...**

అనంతరం కలెక్టర్ గోప్లాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించి విద్యార్థులకు భోజనం గ్యాస్ స్టవ్‌పై వండుతున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, వంటగది పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, వంటగది పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ యాదయ్య, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఫుడ్ కమిషన్ చైర్మన్

- చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా



**కల్వకుర్తి, ఆగస్టు 20 (జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యురాలు శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల హాజరు, వారికి అందుతున్న పౌష్టికాహారం తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఆహార పదార్థాల నిల్వ, పంపిణీ, నిర్వహణ తీరును పరిశీలించారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి..

- ప్రాథమిక సామర్థ్యాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి..
- పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం:ఆర్‌జేడీ సోమిరెడ్డి



**మహమ్మదాబాద్, ఆగస్టు20 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను ఆర్‌జేడీ సోమిరెడ్డి గురువారం సందర్శించారు. బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశానికి హాజరై ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన ఎల్‌ఈపీ ఆధారంగా బోధన కొనసాగించాలని సూచించారు.ప్రతి విద్యార్థికి చదవడం,రాయడం వంటి ప్రాథమిక సామర్థ్యాలు అలవడేలా కృషి చేయాలన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి. అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో మం డల విద్యాధికారి రాజు నాయక్,బాలికల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సమి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి టీకాకు డిజిటల్ నమోదు తప్పనిసరి

- యు-విన్ పోర్టల్‌పై నాగర్‌కర్నూల్ డివిజన్ ఏఎన్‌ఎంలు, డీఈఓలకు ప్రత్యేక శిక్షణ



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 20 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ డిజిటల్ వ్యాక్సినేషన్ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యు-విన్ (యు-విన్) పోర్టల్ వినియోగంపై నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఇమ్యూనైజేషన్ అధికారి కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని ఏఎన్‌ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తమకు కేటాయించిన ట్యాబ్‌లతో హాజరయ్యారు. లబ్ధిదారుల నూతన నమోదు, టీకా డోసుల నమోదు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, డేటా అప్‌డేషన్‌తో పాటు పోర్టల్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారంపై సిబ్బందికి ప్రత్యక్షంగా ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఏపీఓ రాజేశ్వర్, యు-విన్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, వీసీసీఎం దివ్య, హెచ్ఈఓ శ్రీనివాసులు, ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



**ఉప్పునుంతల (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కొత్త రామ్ నగర్‌కు చెందిన గుర్రపు పాండు(40) అనుమానాస్పదంగా మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పైపులు మార్చేందుకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఆయాసంగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గుర్తుతెలియని పాము కాటు లేదా గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య గుర్రపు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు.

# రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలి

- ఆయిల్ పామ్ పంటలతో మంచి ఆదాయం
- వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు20 (జనంసాక్షి):** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులలో పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆరుతడి పంటలను సాగుచేయాలని, ఆయిల్ పామ్ పంటలతో కూడా మంచి ఆదాయం సమకూరుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి సురేంద్ర మోహన్ అన్నారు. గురువారం జిల్లాలో పర్యటించిన వ్యవసాయ శాఖ కార్యదర్శి మానోపాడ్ మండలం జల్లపూర్ గ్రామంలో రైతు కంకణాల రామ్ రెడ్డి 50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన పామాయిల్ తోటను పరిశీలించి రైతును అభినందించారు. రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులను మిశ్రమంగా వాడుతూ తగినంత నీరు పెట్టడం వలన మంచి దిగుబడి వచ్చిందని రైతు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ రైతుకు 248 టన్నులు దిగుబడి రావడంతో రూ.58.03 లక్షలు లబ్ధి పొందినట్లు తెలిపారు. బిందుసేద్యం, పామ్ మొక్కల పైన అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నాగన్న అనే రైతు ఎన్ఎఫ్ఎం ఎస్ ద్వారా రాయితీ పొందిన కంది పంటను పరిశీలించి రైతును అభినందించారు. అనంతరం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లిలో ఆయిల్ పామ్ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్యదర్శి జోగులాంబ గద్వాల జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధు మోహన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జనరల్ మేనజర్ సుధాకర్ రెడ్డి, ఉద్యాన వ్యవసాయ అధికారులు, రాజశేఖర్, ఇమ్రాన్, మహేష్, కరుణశ్రీ, ఆయిల్ ఫెడ్ కంపెనీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**గోపాల్‌పేట పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ ఆకస్మిక తనిఖీ**



**గోపాల్‌పేట, ఆగస్టు 20(జనంసాక్షి):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ సూచించారు. గోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా గర్భిణుల EDD ఫాలోఅప్‌లను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే ప్రసవం జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గర్భిణికి ఎనీ పరీక్షలు నిర్వహించి రక్తహీనతను గుర్తించాలని, అనీమియా ఉన్న వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు అందించాలని ఆదేశించారు. తీవ్ర రక్తహీనత కేసులను జిల్లా ఆసుపత్రికి సకాలంలో రిఫర్ చేసి అవసరమైన చికిత్స అందించాలన్నారు. ల్యాబ్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో రోజుకు 100 మంది ఓపీకి వస్తే కనీసం 20 మందికి HB పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఫార్మసీని తనిఖీ చేసి మందుల నిల్వ, పంపిణీపై ఆరా తీశారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు బాధితులకు నెలవారీ మందులు ఎలాంటి కొరత లేకుండా అందించాలని స్పష్టం చేశారు.

వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిధిలో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. లేబర్ రూమ్‌ను పరిశీలించి పరిశుభ్రత, ప్రసవ సేవలపై పలు సూచనలు చేశారు.

వారం రోజులకు మించి జ్వరం లేదా దగ్గు ఉన్నవారిని నిర్లక్ష్యం చేయకుండా కఫ నమూనాలను సేకరించి టీ-హబ్ కేంద్రానికి సకాలంలో పంపించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చాంద్ పాషా, MPHEO నరసింహారావు, PHN ప్రమీల, నాగమణి, కౌసల్య, హెల్త్ సూపర్‌వైజర్ మధుబాబు, హెల్త్ అసిస్టెంట్లు జ్ఞానేశ్వర్, ఫార్మసిస్ట్ కవిత, DEO భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి - కలెక్టర్‌కు టీయూసీఐ వినతి



**గద్వాల, ఆగస్టు 20 (జనంసాక్షి):** జాతీయ కమిటీ పిలుపు మేరకు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. గౌరవప్రద జీవనానికి సరిపడా కనీస వేతనంగా రూ.39,373 ఇవ్వాలని, కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.
జిల్లా అధ్యక్షులు చంద్రములు మాట్లాడుతూ "1957లో జరిగిన 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్ణయించిన నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పు (1992) ప్రకారం శాస్త్రీయంగా నిర్ణయించిన అవసరాల ఆధారిత వేతనాన్నే చట్టబద్ధమైన కనీస వేతనంగా నిర్ణయించాలి. ప్రస్తుతం ఇస్తున్న వేతనం కేవలం పేదరికంలో జీవించేలా ఉంది. కార్మికుడి కుటుంబ అవసరాలు, ఆరోగ్యం, గౌరవం నిలబడేలా వేతనం ఉండాలి" అని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 51 జీవోను రద్దు చేసి, 60 జీవో ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా డైరెక్ట్ గా కార్మికుల అకౌంట్లలోనే జీతాలు వేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగన్న, సిద్దయ్య, శంకరన్న, భీమన్న, సవరన్న, హనుమంతు, గోపాల్ నాయక్, శివన్న, తిమ్మప్ప, నల్లస్వామి, బీచ్‌పల్లి రాఘవేంద్ర, వెంకట్రామిరెడ్డి తదితర కార్మికులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ అభ్యర్థులకు శారీరక శిక్షణ



**నారాయణపేట ఆగస్టు 20(జనంసాక్షి):**
నారాయణపేటలో లైన్స్ క్లబ్, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచితంగా అగ్నివీర్ అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ వాటికి శారీరక శిక్షణ ఇస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. అగ్నివీర్ అభ్యర్థులకు లైన్ క్లబ్ పూర్తి సహకారం అందిస్తుందని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ తెలిపారు.

## పేద కుటుంబాలకు ప్రభుత్వం అండ

- కొత్త రేషన్ కార్డుల పంపిణీ



**కొత్తపల్లి ఆగస్టు 20 (జనంసాక్షి):**
కొత్తపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామంలో గురువారం అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అర్హత కలిగిన కుటుంబాలకు రేషన్ కార్డులు అందిస్తూ ఆహార భద్రత కల్పించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపడుతోంది. కొత్త రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రేషన్ కార్డుల పంపిణీ పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ ఆంజనేయులు, మన్నాపూర్ రేషన్ డీలర్ రామ్‌రెడ్డి, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు20 (జనంసాక్షి):**
పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థుల్లో ఆందోళనకు కారణమవుతున్న జీవో నంబర్ 97ను, పాలిటెక్నిక్ విద్యాసంస్థలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే చర్యలను నిలిపివేయాలని కోరుతూ వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.



వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థులు జీవో నంబర్ 97తో తమ విద్యా భవిష్యత్తుపై నెలకొన్న అనుమానాలు, శక్తి స్కీమ్‌కు సంబంధించిన అంశాలు, పాలిటెక్నిక్ విద్యాసంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలపై తమ ఆందోళనను వివరించారు. విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే సానుకూలంగా విన్నారు. జీవో నంబర్ 97, శక్తి స్కీమ్‌కు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి భవిష్యత్తును కాపాడేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు భరోసా కల్పించేలా సంబంధిత అంశాలపై ప్రభుత్వంతో చర్చిస్తానని ఆయన తెలిపారు.

## ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారి మరమత్తులు చెయించిన సర్పంచ్





**కృష్ణ, ఆగస్టు 20 (జనంసాక్షి):** కృష్ణ మండలంలోని కున్సి గ్రామ సమీపంలో హిందుపూర్ – యాదగిరి ప్రధాన రహదారి 150 పై కున్సి గ్రామ రైల్వే బ్రిడ్జి దగ్గర గత కొంతకాలంగా రోడ్డు చాలా దెబ్బతిని, అధ్వాన్నంగా మారి తరచూ ప్రమాదాలు, జరుగుతున్నాయి. రాకపోకలకు ప్రజలకు చాలా ఇబ్బంది కారంగా మారింది. అది గమనించిన కున్సి గ్రామ సర్పంచ్ మ్యకల్ సురేష్ రోడ్డుకు ఇరువైపులా మరమత్తులు చేయించారు. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉన్నందున గుంతలకు, మరమత్తులు వేయించారు. ఈ కార్యక్రమంలో రామ్ చందర్ జయప్ప గౌడ్, నాగిరెడ్డి, శశీక్రప్ప, బుడ్డమోళ్ళ రామ్, మ్యాకల్ భిమ్, చెన్నప, గణేష్, తదితరులు దగ్గర ఉండి పనులను పరివేక్షించారు.

## ఎఫ్.ఎల్.ఎన్.ప్రాథమిక ఉపాధ్యాయుల ఉచ్వాస, నిశ్వాస కావాలి



**మల్దకల్, ఆగస్టు 20 (జనంసాక్షి):**
సముదాయంలోని పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు సమర్ధవంతంగా జరిగి విద్యార్థులకు గుణాత్మక విద్య అందాలంటే, ఉపాధ్యాయులు ఎఫ్ ఎల్ ఎన్ అమలే ఉచ్వాస,నిశ్వాసలుగా విధి నిర్వహించాలని సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ సూచించారు. గురువారం అమరవాయిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన విద్యా అంశాలపై సమీక్షించి, రాబోయే నెలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.
రాబోయే నెలలో నిర్వహించాల్సిన విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన ప్రగతి, పాఠశాల స్థాయి చర్యలు తదితర అంశాలపై ప్రణాళిక రూపొందించుకున్నారు.
ఉత్తమ ఎంఈఓ సురేష్, ఉత్తమ ఎఫ్ ఎల్ ఎన్ ఉపాధ్యాయుడుగా ఎంపికైన సురేష్,సీతం నాయుడులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సముదాయ పాఠశాల సెక్రటరీ శాంతన్న, సిఆర్పిపద్మమ్మ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుకు స్పందించిన యువజన, క్రీడల అధికారి

- క్రీడా సంఘాల వాకర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శంకర్ ప్రభాకర్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 20(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున ఉన్న ఇండోర్ స్టేడియం ప్రక్కన ఉన్న ఫంక్షన్ హాల్ నుండి వెదజల్లుతున్న కాలుష్యాన్ని నివారించి తగు చర్యలు సంబంధిత ఫంక్షన్ హాల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రాంబలింగేశ్వర గౌడ్ తమకు లిఖితపూర్వకంగా తెలిపినట్లు క్రీడా సంఘాల, వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర ప్రభాకర్ తెలిపారు. ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంలో గద్వాల ఇండోర్ స్టేడియంలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడంతో పాటు, స్టేడియం ప్రక్కన ఉన్న ఫంక్షన్ హాల్ నుండి వెలువడుతున్న పొగ వల్ల క్రీడాకారులు మరియు వాకర్స్ కు కలుగుతున్న అసౌకర్యం అలాగే ఇండోర్ స్టేడియంలో ఉన్న గదులను అద్దెకు ఇవ్వుటకు సంబంధించిన అంశాలపై చేసిన ఫిర్యాదును పరిశీలించడం జరిగిందనీ,ఇండోర్ స్టేడియంలో మరుగుదొడ్డ నిర్మాణ,మరమ్మత్తు పనులు త్వరలో ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయడం జరుగుతుందనీ అదేవిధంగా క్రీడాకారులు, వాకర్స్ సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందనీ, ఇండోర్ స్టేడియంలో ఉన్న 6 గదులను అద్దెకు ఇవ్వుటకు సంబంధించిన మీ వినతిని కూడా పరిశీలనలో ఉంచడమైనదనీ, సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విషయాన్ని పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందనీ జిల్లా యువజన క్రీడల అధికారి రామలింగేశ్వర్ గౌడ్ తెలిపినట్టు శంకర్ ప్రభాకర్ తెలిపారు.

## బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ



**ఎర్రవల్లి, ఆగస్టు20 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండలం బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని గురువారం తెలంగాణ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్ర మోహన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో పురందరు కుమార్ అర్చకులు సందీప్ పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో గోత్రనామాలతో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ విశిష్టత గురించి ఈవో వారికి వివరించారు.

## 23 న పేట జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



**నారాయణపేట, ఆగస్టు 20(జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లా కోదాడలోసెప్టెంబర్ 11 తేదీ నుండి 13వ తేదీ వరకు జరగనున్న 73వ తెలంగాణ రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొనే నారాయణపేట జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక ఈ నెల 23న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్య క్షులు జి.నాగేశ్వర్ రెడ్డి, కార్యదర్శి సి. వెంకటప్ప తెలిపారు. నారాయణపేట మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు ఎంపికలు నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే మహిళ క్రీడాకారులు 75 కిలోల లోపు బరువు ఉండాలని, తప్పనిసరిగా ఆధార్ కార్డు తో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99591 86668, 94914 89754 సెల్ ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు ఎమ్మెల్యే కసిరెడ్డి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- పెండింగ్ రహదారి పనులు పూర్తి చేసి.. కొత్త రోడ్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి




**కల్వకుర్తి,ఆగస్టు 20 (జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టి సారించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గిరిజన పంచాయతీరాజ్ శాఖల అధికారులతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు.తొలి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణ స్థితి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, రెండో విడతలో మంజూరు చేయాల్సిన ఇళ్లకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.

**రహదారి పనులపై ప్రత్యేక దృష్టి...**

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు, కొత్తగా మంజూరు చేయాల్సిన రోడ్లు, బీటీ రోడ్ల ప్రతిపాదనలు, ఇప్పటికే మంజూరై నిర్మాణంలో ఉన్న పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను,కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలి...**

కల్వకుర్తినియోజకవర్గ అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాలని,అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు జయరాం, గీత, సీత, శంకర్‌నాయక్, విజయలక్ష్మి, సులోచన, సుజాత, మున్సిపల్ కమిషనర్లు రాఘవేందర్,షేక్ మొహమ్మద్, పంచాయతీరాజ్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, బసవలింగం, పంచాయతీరాజ్ ఏఈలు,గృహ నిర్మాణశాఖ ఏఈలు,డీలర్లు,కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమైక్యతే మన శక్తి, సద్భావనే మన ప్రగతి



**జడ్చర్ల, ఆగస్టు 20 (జనంసాక్షి):** దేశంలో శాంతి, మత సామరస్యం, ఐక్యతలతోనే ప్రగతి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు వంశీకృష్ణ చారి ఆధ్వర్యంలో సిగ్నల్ గడ్డ అంబేద్కర్, పూలే చౌరస్తాలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమైక్యతే మన శక్తి, సద్భావనే మన ప్రగతి అనే సిద్ధాంతంతో రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు, బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక రంగంలో దేశాన్ని ప్రపంచ సరసన నిలిపిన ఘనత రాజీవ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ జిల్లా, మండల, పట్టణ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మహిళా, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ అసెంబ్లీ స్థాయి సర్ ఫేస్-2 కార్యశాల



**గద్వాల, ఆగస్టు 19 (జనంసాక్షి):**
గద్వాల అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సర్ ఫేస్-2 కార్యశాల మంగళవారం పట్టణంలోని డీకే బంగ్లాలో ఘనంగా జరిగింది. జిల్లా బీజేపీ అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా జిల్లా యువ నాయకురాలు డాక్టర్ డీకే స్నిగ్ధా రెడ్డి హాజరయ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియను కార్యకర్తలు సీరియస్ గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఫేస్-2 లో ముసాయిదా ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్కరి ఓటు ఉందో లేదో చూసుకోవాలని, లేని పక్షంలో ఫారం-6 ద్వారా చేర్పించాలన్నారు. చనిపోయిన, బోగస్ ఓట్లను ఫారం-7 ద్వారా తొలగించాలని, తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా సరిచేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. నోటీసులు వస్తే సమాధానం ఇచ్చి ఓటును కాపాడుకోవాలని సూచించారు. సర్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోగస్ ఓట్ల తొలగింపుకు ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకటరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ఎక్బోటే, శ్యామ్ రావు, ఏమ్మెల్సీ ఎలక్షన్ కో ఆర్డినేటర్ మహేష్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, మాజీ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌సింగ్ తండాలో సమగ్ర క్షేత్ర నీటి కుంట పనుల ప్రారంభం




**నవాబ్‌పేట, ఆగస్ట్ 20(జనంసాక్షి):** మండల పరిధిలోని రామ్‌సింగ్ తండా గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా సమగ్ర క్షేత్ర నీటి కుంట (ఇంటిగ్రేటెడ్ ఫార్మ్ పాండ్) నిర్మాణ పనులను గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అధికారికంగా ప్రారంభించారు. భూగర్భ జలాల పెంపునకు, వ్యవసాయ రంగానికి నీటి కుంటలు ఎంతో దోహదపడతాయని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సహాయ సమాచార అధికారి (APO), పంచాయతీ కార్యదర్శి (PS), సాంకేతిక సహాయకులు (TA), ఫీల్డ్ అసిస్టెంట్ (FA - పేస్), ఉపాధి హామీ కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం: బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి తీవ్ర గాయాలు!




**బాలానగర్, ఆగస్టు 20 (జనంసాక్షి):**
తిరుమలాపూర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి తిరుమలాపూర్ సమీపంలోని వెంచర్‌ను చూసేందుకు వెళ్తున్న ఓ కారు వేగంగా వస్తూ అదుపుతప్పింది. ఈ క్రమంలో ఎదురుగా బైక్‌పై వెళ్తున్న రాజాపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన అంజయ్య ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అంజయ్య కుడికాలు పూర్తిగా విరిగిపోయింది. తీవ్ర గాయాలతో రోడ్డుపైనే కుప్పకూలిన అతడిని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు.

## మాచర్ల అంగన్వాడీలో నాగుపాము..

- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన



**గట్టు, ఆగస్టు 19 (జనంసాక్షి):** గట్టు మండలం మాచర్లలోని అంగన్వాడీ కేంద్రంలో నాగుపాము ప్రత్యక్షం కావడంతో చిన్నారుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మాచర్ల గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు 2, 3 లను ఒకే చిన్న భవనంలో నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలకు కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాములు, తేళ్లు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమృతం లాంటి పిల్లలను ప్రభుత్వం బాధ్యతతో చూడాలి. కానీ ఇక్కడ ఒకే గదిలో రెండు కేంద్రాలు, చుట్టూ ముళ్లపొదలు, చెత్త. పాము కనిపించడంతో ఇక పిల్లలను బడికి పంపాలంటేనే భయమేస్తోంది" అని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

**గ్రామస్థుల డిమాండ్లు...**

అంగన్వాడీ -3 కు వెంటనే ప్రత్యేక భవనం కేటాయించాలని,కేంద్రం పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయాలని,చిన్నారులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, మూడేళ్ల పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## హైస్పీడ్ వాహనాల నియంత్రణకు భారీ గేట్లు: సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్




**నంగునూరు, ఆగస్టు 20(జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ చౌరస్తాలో వాస్విక్ ఫౌండేషన్ జనగామ వారి సహకారంతో ఏర్పాటు చేసిన 6 భారీ గేట్స్ ని స్థానిక సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి, నాయకులు లింగం గౌడ్ లతో కలిసి సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, రాజగోపాల్ పేట ఎస్సై వివేక్ ప్రారంభించారు. ఈ మేరకు రాంపూర్ క్రాసింగ్ వద్ద ఈ మధ్య కాలంలో అనేక యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని ఈ భారీ గేట్స్ వాహనాల స్పీడ్ నియంత్రణకు దోహద పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ తన కుమారుడి జ్ఞాపకార్థం తన సంపాదనలో 33 శాతం ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడం చాలా అభినందనీయమైన విషయమని అన్నారు. ఈ భారీ గేట్స్ బందోబస్తు సమయంలో గాని వాహనాల తనిఖీలో గాని పోలీసులకు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా వాస్విక్ ఫౌండేషన్ వారికి పోలీస్ శాఖ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ ఉప సర్పంచ్ తిరుపతి గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాకేష్ రెడ్డి, వార్డు సభ్యులు, పలువురు యువకులు పాల్గొన్నారు.



## హస్తం మండల కమిటీ నియామకం

పాపన్నపేట, ఆగస్టు 20 (జనంసాక్షి): తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంగా ఉండడానికి మండల కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలని టీపీసీసీ నిర్ణయించింది. దీంట్లో భాగంగా మెతుకు సీమలో పెద్ద మండలమైన పాపన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని నియామించారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సజావుగా సాగింది. మండల ఉపాధ్యక్షులుగా .. కన్నగంటి వెంకట క్రిష్ణ నాని,హీరాలాల్,రవి,రాజశేఖర్,ట్రెజరర్ గా కొనిశీటి రాజేందర్,ప్రధాన కార్యదర్శులుగా నీరుడి రమణ,బ్యాగరి బాబు,సాలె హను మంతు, భూమన్నల రవీందర్, ముచ్చ బాగయ్య, పుట్టలదుర్గయ్య, కార్యదర్శులుగా.. చాకలి నర్సింలు, కుర్మ నాగరాజు,లక్ష్మపురం మల్లేశం,పిల్లుట్ల పోచయ్య,కట్ట సుధాకర్ నియమించారు.

## విజయ డైరీ పెంచిన పాల ధరల కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

### పాడి రైతులు పెంచిన పాల ధరలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20(జనంసాక్షి): పాడి రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విజయ డైరీ పాల కొనుగోలు ధరలను పెంచిందని, పెంచిన ధరలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని విజయ డైరీ పాల సేకరణ కేంద్రాల్లో పాలు విక్రయించి ఆర్థికంగా లబ్ది పొందాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.

గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో తన ఛాంబర్ లో విజయ డైరీ పాడి రైతులకు పెంచిన పాల కొనుగోలు ధరలకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్, డైరీ డెవలప్మెంట్ డి.సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ, విజయ డైరీ గేదె పాల కొనుగోలు ధరను లీటరుకు రూ.6, ఆవు పాల కొనుగోలు ధరను లీటరుకు రూ.2 చొప్పున పెంచినట్లు తెలిపారు. పెంచిన ధరలు 16.08. 2026 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరతో పాటు ప్రతి 15 రోజులకు పాల బిల్లుల చెల్లింపు, పాడి పశువులకు బీమా సౌకర్యం, తక్కువ ధరకే నాణ్యమైన పశు దాణా, పశుపోషణకు అవసరమైన కాల్షియం, మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందులు, గడ్డి విత్తనాలను విజయ డైరీ ద్వారా అందిస్తున్నట్లు డీడీ తెలిపారు. అదేవిధంగా పాడి పశువుల కొనుగోలుకు యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడి రైతులు మధ్యవర్తులు, ఇతర ప్రైవేటు డైరీలకు పాలు విక్రయించి నష్టపోకుండా విజయ డైరీ పాల



సేకరణ కేంద్రాల్లోనే పాలు విక్రయించాలని, తద్వారా పెంచిన పాల ధరలతో పాటు విజయ డైరీ అందిస్తున్న ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్దిపొందాలని డీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివానంద స్వామి, డి ఆర్.డి.ఓ నర్సింహులు, డైరీ మేనేజర్ యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల తరలింపును ఉపసంహరించుకోవాలి

- మంత్రి వాకిటి శ్రీహరికి విద్యార్థులు, ఏబీవీపీ నాయకుల వినతి
- ఆరు ఎకరాల స్థలం ఉండగా అర ఎకరంలోకి మార్చడంపై అభ్యంతరం
- కళాశాల ప్రాంగణంలోనే శాశ్వత భవనం నిర్మించాలని డిమాండ్

మక్తల్, ఆగస్టు 20 (జనంసాక్షి): మక్తల్ పట్టణంలోని ఆరు ఎకరాల విశాలమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని కాదని, అర ఎకరం కూడా లేని ఇరుకైన ప్రాంతానికి కళాశాలను తరలించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ కళాశాల విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు.

?ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ, జిల్లాలోనే అత్యధికంగా సుమారు 600 మంది విద్యార్థులతో కొనసాగుతున్న మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను వేరొక ప్రాంతానికి తాత్కాలికంగా లేదా శాశ్వతంగా తరలిస్తే విద్యార్థుల చదువులతో పాటు రాబోయే విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాల మైదానంపై పూర్తి హక్కులు కళాశాలకే ఉండాలని వారు డిమాండ్ చేశారు.

కళాశాల తరలింపుపై అధికారుల్లో స్పష్టత లేకపోవడంతో ఇప్పటికే అయోమయానికి గురైన విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయగా, వారికి ఏబీవీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. ఇప్పటికే రూ. 9 కోట్ల నిధులు మంజూరైన డిగ్రీ కళాశాల స్థల కేటాయింపు, నిర్మాణంపై స్పష్టత లేని తరుణంలో, ఎకరం కూడా లేని స్థలంలో జూనియర్, డిగ్రీ కళాశాలలకు కలిపి కేవలం రూ. కోటి కేటాయించడం సమంజసం కాదన్నారు.



తాత్కాలిక నిర్వహణ కోసం ఎంపిక చేసిన స్థలం ఏమాత్రం అనుకూలంగా లేదని, దీనిపై అధికారులను వివరణ కోరగా కేవలం భవన నాణ్యతా నివేదికను మాత్రమే పరిశీలిస్తున్నామని, ఇంటర్ బోర్డు నుంచి తరలింపునకు సంబంధించి ఎలాంటి అధికారిక ఆదేశాలు రాలేదని తెలిపినట్లు వినయ్ కుమార్ పేర్కొన్నారు. కళాశాలలో రెండు ఒకేషనల్ కోర్సులు మంజూరైనా సరైన గదులు, సిబ్బంది లేక నిర్వహించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ గందరగోళానికి తెరదించి, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కళాశాల ప్రాంగణంలోనే తాత్కాలిక ఏర్పాట్లు చేసి పాత భవనాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. అదనపు తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, విద్యార్థినులకు ప్రత్యేక విశ్రాంతి గదులు, మూత్రశాలలు వంటి అన్ని వసతులతో శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కళాశాల అధ్యక్షుడు అక్షయ్, కార్యదర్శి చరణ్, నాయకులు రాకేష్, పూజ, వైష్ణవి, అంబ్రేష్, శివ, అనిరుధ్, నవీన్, అనిల్, శ్రీకాంత్, అక్షయ్ కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జూరాల రోడ్డుపై 'మృత్యు' దిమ్మె.. బలైన ఇద్దరు యువకులు

ధరూర్, ఆగస్టు 19 (జనంసాక్షి): జూరాల ప్రాజెక్టు రోడ్డుపై ఉన్న ఓ ప్రమాదకర దిమ్మె మరో రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ధరూర్ పోలీసుల వివరాల ప్రకారం రాజాపూర్ మండలం మల్లేపల్లికి చెందిన శివకుమార్ (24), పీర్లగూడెంకు చెందిన గణేష్ (23) బుధవారం రాత్రి బైక్ పై వెళ్తుండగా జూరాల రోడ్డులో అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డారు. మరో యువకుడు శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శివకుమార్, గణేష్ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు.



**"ఇది తొలిసారి కాదు... ఈ దిమ్మె చరిత్రే ప్రమాదాలమయం"...**

స్థానికుల కథనం ప్రకారం, ఈ దిమ్మె ఇప్పుడు కొత్తగా వేసింది కాదు. గత కొన్ని ఏళ్లుగా రోడ్డుపై అడుగు ఎత్తులో అడ్డంగా ఉన్న ఈ స్పీడ్ బ్రేకర్ లాంటి నిర్మాణం వల్ల ఇప్పటికే చాలామంది ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. అనేక కార్లు కూడా ఈ దిమ్మెను దాటలేక అదుపుతప్పి పక్కకు ఒరిగిన దాఖలాలు ఉన్నాయి.రాత్రి సమయంలో ఎలాంటి రేడియం స్ట్రిప్ లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు దీనిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు."పదే పదే చెప్పినా ప్రాజెక్టు అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్ వేయలేదు. ఇది స్పీడ్ బ్రేకర్ కాదు, మృత్యు దిమ్మె. దీనివల్లే రెండు కుటుంబాల్లో విషాదం నిండింది" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదకర దిమ్మెను వెంటనే తొలగించి, నిబంధనల మేరకు స్పీడ్ బ్రేకర్ లు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాంకేతిక విద్యను నిర్వీర్యం చేసే ఆలోచన మానుకోవాలి

- ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ రాస్తారోకో

చేర్యాల, ఆగస్టు 20(జనంసాక్షి): సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి మూడు కిలోమీటర్ల వరకు భారీ ర్యాలీ నిర్వహించి చేర్యాల పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి భరత్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విరమించుకోవాలని,పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నం.97ను రద్దు చేయడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని, సాంకేతిక విద్యను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయి, కార్పొరేట్ కంపెనీల్లో తక్కువ వేతనాలకే పనిచేసే పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు ఎంతో కాలంగా అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని,1957 నుంచి ఎంతో మంది సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లెనిన్ రాజ్,హరీష్,అక్రమ్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే యాసిన్, గిరిక అభినవ్, పాలిటెక్నికల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.






## బాలికల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధనపై అవగాహన



మల్దకల్, ఆగస్టు 20 (జనంసాక్షి): మండల కేంద్రంలోనిపి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కోసం గర్ల్ చైల్డ్ ఇంటరాక్షన్,రోల్ మోడల్స్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను రోల్ మోడల్స్‌గా పరిచయం చేసి,వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలతారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉషారాణి రోల్ మోడల్స్‌గా పాల్గొని బాలికలతో ముచ్చటించారు. పాఠశాల బాలికలను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ ఆసుపత్రికి ఫీల్డ్ విజిట్‌కు తీసుకెళ్లారు. విద్యార్థినులు కళాశాలలో ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలు,లక్ష్యసాధనకు సంబంధించిన ప్రశ్నలను అడగగాప్రిన్సిపాల్ శ్రీలతా రెడ్డి వారికి చక్కటి సమాధానాలు అందించారు.ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనలో విద్యార్థినులు వైద్య వృత్తి, ఆరోగ్యం, విద్యార్థినుల భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై డాక్టర్ ఉషారాణిని వివిధ ప్రశ్నలు అడిగారు. ఆమె విద్యార్థినులకు స్ఫూర్తినిచ్చే విధంగా సమాధానాలు ఇచ్చి, తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి. సురేష్,ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యు.రాజేశ్వర్ రెడ్డి పాల్గొని బాలికలకు ప్రోత్సాహం అందించారు. వీరితోపాటు డాక్టర్ ప్రణీత,శ్రీధర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పోచారం అడవిలో పర్యాటకుల కోసం కొత్త వెహికల్ ప్రారంభం

**హవేలి ఘనపూర్ మండలం, ఆగష్టు 20 (జనంసాక్షి):** పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటక సౌకర్యాల విస్తరణకు చర్యలు: ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మెదక్ జిల్లా పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు, అడవి అందాలను సౌకర్యవంతంగా వీక్షించేందుకు కొత్త ప్రయాణ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఈ వాహనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచారం అటవీ ప్రాంతం ప్రకృతి సౌందర్యానికి నిలయంగా ఉందని, ఇక్కడికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త వాహనం అందుబాటులోకి రావడంతో పర్యాటకులు అడవి అందాలను మరింత దగ్గరగా, సౌకర్యవంతంగా వీక్షించే అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పోచారం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే పోచారం అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అటవీ ప్రాంతంలో పర్యటించే పర్యాటకులు అటవీ శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రకృతి సంపదను కాపాడాలని ఎమ్మెల్యే సూచించారు. భవిష్యత్‌లో పర్యాటకుల సౌకర్యార్థం మరిన్ని




అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొత్త ప్రయాణ వాహనం అందుబాటులోకి రావడంతో పోచారం అడవిని సందర్శించే పర్యాటకులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కలగనుంది.

## సన్న వరి రకాల బోనస్‌కు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

**కొల్చారం, ఆగస్టు 20 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సన్న వరి రకాల బోనస్ పొందాలంటే సీడ్ షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా సంబంధిత విత్తన దుకాణాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు. సెప్టెంబర్ 10లోగా నమోదు చేసుకోవాలి. బోనస్ కోసం ఆన్‌లైన్ నమోదు చేసుకునే సమయంలో రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఇచ్చిన రసీదు (బిల్లు) తప్పనిసరిగా తీసుకెళ్లాలని అన్నారు. కే ఎన్ ఎం-1638 కేఎన్‌ఎం-7715హెచ్‌ఎంటి సోనా జైశ్రీరామ్ బిపిటి-5204ఆర్ ఎన్ ఆర్-15048 వరంగల్-44 తెలంగాణ సన్నాల రకాల బోనస్ వర్తిస్తుందని శ్వేత కుమారి తెలిపారు.

## దశదినకర్మ పాల్గొన్న కొండపాక మండల ప్రజా ప్రతినిధులు



**కొండపాక, ఆగస్టు 20 (జనంసాక్షి):** కొండపాక మండలానికి చెందిన ప్రజాప్రతిథులు సిద్దిపేట మాజీ చైర్మెన్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి మాతృమూర్తి మచ్చ జయమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి,గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు, శ్రీనివాస్ కొండపాక మాజీ ఎంపీపీ ర్యాగల సుగుణదుర్గయ్య, మండల్ ప్రెసిడెంట్ నూనె కుమార్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కమలాయపల్లిలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- **సంఘం రాష్ట్ర కోశాధికారి తునికి మహేష్**

**చేర్యాల, ఆగస్టు 20 (జనంసాక్షి):** చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామపంచాయతీ సిబ్బందిని వీధుల్లోకి తీసుకోవాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తునికి మహేష్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్న పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ చేర్యాల మండల ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్టీ పర్పస్ విధానము వచ్చిన తర్వాత గ్రామపంచాయతీ సిబ్బందిపై అనేక ఇబ్బందులు వస్తున్నాయని, వెంటనే మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలి, కమలాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో మండల వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో, ఎంపీఓ చొరవ తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. పంచాయతీ కార్మికుల పోరాటానికి సిఐటియు రైతు సంఘం కల్లుగీత కార్మిక సంఘం మత్స్య కార్మిక సంఘ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి



వెంకట మావో, బండకింది అరుణ్ కుమార్, తుప్పతి రాజు, తేలు ఇస్తారి, అమ్ముల బాల నరసయ్య, చిట్యాల కనకయ్య, మల్లిగారి బాల నరసయ్య, గంగి బాలకృష్ణ, చందు,యాదగిరి, కనకమ్మ, నవీన్, శంకర్, పద్మ, లావణ్య, లచ్చవ్వ, కుమార్, కనకయ్య, సుధా తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవం కార్యక్రమ ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సమీక్ష

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్ట్ 20(జనంసాక్షి):** ఈ నెల 25 న నిర్వహించనున్న 'వనమహోత్సవం' కార్యక్రమ ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ (రెవి) గురువారం వివిధ శాఖల జిల్లా అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణ కోసం వివిధ శాఖలు చేపడుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వన మహోత్సవం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హరితవనాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో వనమహోత్సవం కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను అదనపు కలెక్టర్ నొక్కి చెప్పారు.



ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేలా చూడాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాలను గుర్తించడం, మొక్కల లభ్యత మరియు పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయడం, అలాగే నాటిన మొక్కల సంరక్షణ మరియు నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మొక్కలు నాటే కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడం , నివేదించడం యొక్క ఆవశ్యకతను కూడా అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా అధికారులు అందరూ పరస్పర సమన్వయంతో పనిచేసి, వనమహోత్సవం కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతమైన కార్యక్రమంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

### ఆగస్టు 23 చలో హైదరాబాద్

# బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



అయితే పదవీ విరమణ అనంతరం సి పి ఎస్ విధానం కారణంగా ఉద్యోగులకు తగిన ఆర్థిక భరోసా లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఉద్యోగి జీవిత చరమాంకంలో ఆర్థిక భద్రత కల్పించేది పాత పెన్షన్ విధానమేనని, ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

అయిజ పి ఎం శ్రీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ మీటింగులోను , ఐజ పురపాలక కార్యాలయం నందు, ఎంపీడీవో కార్యాలయం నందు ఆగస్టు 23 కార్యక్రమం క్యాంపెనింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, గత 22 ఏళ్లుగా సి పి ఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రమైన సామాజిక, ఆర్థిక అభద్రతతో జీవిస్తున్నారని అన్నారు. సి పి ఎస్ విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వారికి లభిస్తున్న పెన్షన్ సరిపడా లేదని పేర్కొన్నారు.

ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేస్తున్న మొత్తంతో పాటు ప్రభుత్వం చెల్లించే వాటా కూడా మార్కెట్ ఆధారిత పెన్షన్ విధానంలో ఉండటంతో ఉద్యోగుల భవిష్యత్‌పై అనిశ్చితి నెలకొంటోందని నాయకులు తెలిపారు. ఇటీవలి అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావంతో ఉద్యోగుల పెన్షన్ నిధుల విలువలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సి పి ఎస్,విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఓపిఎస్, పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని సుమారు 2.6 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రత కోసం ఆగస్టు 23న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జోగులాంబ గద్వాల జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీవో మనోహర్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు , అయిజ మండల విద్యాధికారి రాములు దయాల్ ,సిపియస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చన్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పాల్వాయి లక్ష్మీనారాయణ, అయిజ మండల అధ్యక్షులు వీరేష్, పంచాయతీ సెక్రెటరీ జిల్లా అధ్యక్షులు రాధాగోపాల్, ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, ప్రకాష్, లక్ష్మణ్ తదితర వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**మెదక్ టౌన్, ఆగస్టు 20(జనంసాక్షి):** మెదక్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. శాఖలోని ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు. ఎలాంటి విభేదాలు, బేధాభిప్రాయాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేస్తూ ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. త్వరలోనే నూతన కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎల్లయ్య తెలిపారు. కమిటీ కార్యకలాపాలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తూ, సిబ్బంది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎక్సైజ్ మెదక్ సీఐ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అధికారులు ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, జనరల్ సెక్రటరీ జీవన్, కోశాధికారి శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు





మహేష్ బాబు, జాయింట్ సెక్రటరీ లావణ్య, పబ్లిసిటీ సెక్రటరీ రవి, నాగరాజు, రజిత తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు,సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి

# పలు పరికరాలు అందజేత



చేర్యాల, ఆగస్టు 20 (జనంసాక్షి): వీరన్నపేట గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రానికి అవసరమైన పలు పరికరాలను ఉపసర్పంచ్ బంగారిగల్ల కిరణ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో పల్స్ ఆక్సీమీటర్, గ్లూకోమీటర్, థర్మామీటర్, బీపీ మానిటర్ వాటితోపాటు మరికొన్ని అవసరమైన వైద్య పరికరాలను గ్రామ సర్పంచ్ శైలజ శివశంకర్ చేతుల మీదుగా వైద్య సిబ్బందికి అందించడం ఆనందంగా ఉంది అన్నారు. ఈ పరికరాలతో గ్రామ ప్రజలకు ప్రథమ చికిత్స అందుబాటులో ఉండనుంది. గ్రామ ప్రజల ఆరోగ్యం కొరకు పాలక వర్గం ముందు ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఏలుసాని యాదగిరి, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్ అరుణ, ఆశా వర్కర్ లు భాగ్య, రజిత పాల్గొన్నారు.

## పాతాళగంగ వద్ద బొలేరో బోల్తా.. ఒకరి మృతి

- చేపలు పట్టేందుకు వెళ్తుండగా ప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు
- మరో ఏడుగురికి స్వల్ప గాయాలు





అమ్రాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. క్రిష్ణగిరి సమీపంలోని పాతాళగంగ వద్ద గురువారం బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అచ్చంపేట మండలం బుడ్డ తండా గ్రామానికి చెందిన సోమనాయక్ (52) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చేపలు పట్టేందుకు వెళ్తుండగా...అచ్చంపేట మండలం బుడ్డ తండా గ్రామానికి చెందిన 12 మంది బొలేరో వాహనంలో పాతాళగంగ వైపు చేపలు పట్టేందుకు బయలుదేరారు. క్రిష్ణగిరి సమీపంలోని పాతాళగంగ వద్దకు చేరుకున్న సమయంలో వాహనం అదుపుతప్పి రహదారిపై బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి వాహనంలో చిక్కుకున్న వారిని బయటకు తీశారు.

**ఒకరి మృతి.. పలువురికి గాయాలు...**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సోమనాయక్‌ను బయటకు తీసేలోపే మృతి చెందినట్లు సమాచారం. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తా - సరిత తిరుపతయ్య



గద్వాల, ఆగస్టు 20(జనంసాక్షి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు గద్వాలలో ఘనంగా నిర్వహించారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మహిళా సాధికారతకు నా వంతు కృషి చేస్తా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జి సిద్దేశ్వర్, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డీసీసీ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయ్యాయి. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, ఎన్నికల నోడల్ అధికారి గజ్వేల్ ఏసిపి నరసింహులు మరియు ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఇన్స్పెక్టర్ కిరణ్, చేర్యాల సీఐ రమేష్, ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ తిరుపతి పర్యవేక్షణలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది.

ఈ సందర్భంగా సిపి ఎన్నికల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారికి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో కమిషనరేట్ పరిధిలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నూతన కార్యవర్గ వివరాలు:**

ఈ ఎన్నికల్లో కానిస్టేబుల్ చిందం సుభాష్ (బేగంపేట పోలీస్ స్టేషన్) సిద్దిపేట కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

ఉపాధ్యక్షులుగా మల్లేష్ గౌడ్ (పిసిఆర్ ఇన్స్పెక్టర్) మరియు , అభిలాష్ (కోహెడ ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా సాయి చరణ్ (ఆర్ఎస్ఐ), సంయుక్త కార్యదర్శిగా రవి కుమార్ (సివిల్ కానిస్టేబుల్) కార్యనిర్వాహణ కార్యదర్శిగా గంపల సతీష్(చేర్యాల



కానిస్టేబుల్), కోశాధికారిగా తిరుపతి (కోహెడ కానిస్టేబుల్) ఎన్నికయ్యారు.కార్యనిర్వాహక సభ్యులుగా బి. రాజు, డి. శ్రీనివాస్, టి.యాదగిరి, తార (హెడ్ కానిస్టేబుల్), బి. శ్రీనివాస్ (ఏఆర్పిసి), పి. శాంభవి (ఏఆర్పిసి) ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గానికి సీపీ ఇతర ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు వనపర్తి ఆదర్శం: ఎస్పీ








బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలిక హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రత, భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన సామాజిక సమస్య అని ఎస్పీ పేర్కొన్నారు. తల్లి దండ్రులు బాలికలపై వివాహ ఒత్తిడి తీసుకు రాకుండా వారి కలలను అర్థం చేసుకుని ప్రోత్స హించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహా లకు పూర్తిగా అడ్డుకట్ట వేసి, బాల్య వివాహాల నిర్మూలనలో వనపర్తిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**వైద్యులతో ఆరోగ్య అవగాహన...**

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వైద్యులు బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో వివాహం, గర్భధారణ వల్ల తల్లి, శిశువుల ఆరోగ్యంపై ఎదురయ్యే సమస్యలు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం, పోషకాహార లోపం, మానసిక ఒత్తిడి తదితర అంశాలను వివరించారు. బాలికలకు సరైన వయస్సు వచ్చే వరకు వివాహాన్ని వాయిదా వేయడంతో పాటు విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, మానసిక ధైర్యం కల్పించడం తల్లిదండ్రులబాధ్యత అని సూచించారు.

**భావోద్వేగానికి గురైన బాలికలు...**

బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన పలువురు బాలికలు తమ అనుభవాలను సమావేశంలో పంచుకున్నారు. తమ వివాహాలు ఆపిన సమయంలో కుటుంబ సభ్యులు బాధపడ్డారని, అప్పట్లో పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయామని తెలిపారు. అయితే ఇప్పుడు బాల్య వివాహం జరిగి ఉంటే తమ జీవితాలపై ఎలాంటి ప్రభావం పడేదో అర్థమైందని భావోద్వేగంతో పేర్కొన్నారు. బాలికలు భావోద్వేగానికి గురైన సమయంలో ఎస్పీ వారిని ఓదార్చి, "మీరు ఒంటరిగా లేరు.. పోలీసు శాఖ మీకు అండగా ఉంది" అంటూ ధైర్యం కల్పించారు. అనంతరం బాలికలను శాలువాలతో సన్మానించారు.

**పోస్టర్ల ఆవిష్కరణ...**

కార్యక్రమం అనంతరం 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' పోస్టర్లను ఎస్పీ సునిత రెడ్డి ఆవిష్కరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, ఎస్సైలు విజయ్‌కుమార్, జగన్మోహన్, అంజద్, హైమా, భరోసా, షీ టీం, ఏహెచ్‌టీయూ సిబ్బంది, వైద్యులు, బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన బాలికలు, వారి తల్లిదండ్రులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ మండల సమీక్ష సమావేశం... గ్రామాల సమస్యలపై సర్పంచుల ఆవేదన!

బాలానగర్, ఆగస్టు 20(జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల సమీక్ష సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వాడీవేడిగా జరిగింది. మండలంలోని 37 గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శు లు పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**రెండేళ్లుగా తాగునీటి సమస్య...**

మిషన్ భగీరథ నీరు గ్రామాలకు రెండేళ్లుగా సక్రమంగా సరఫరా కావడం లేదని సర్పంచులు తెలిపారు. విద్యుత్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు.

**తండాల్లో మద్యం, గంజాయి కలకలం...**

గిరిజన తండాల్లో రాత్రివేళ యువకులు మద్యం, గంజాయి సేవించి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని, దీంతో మహిళలు, చిన్నారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచులు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై పోలీసులు నిఘా పెంచాలని, అవగాహన సదస్సులు నిర్వహించి, అక్రమ విక్రయదారులు, వినియోగదారులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రైవేటు పాఠశాలలపై ఫిర్యాదులు...**

పాఠశాల బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నారని సర్పంచులు ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు.

**అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు...**

గ్రామాల్లోని చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి అడ్డుకోవాలని



కోరారు.

**అసంపూర్తి బీటీ రోడ్లపై ఆగ్రహం...**

బాలానగర్ నుంచి గౌతపూర్, అమ్మపల్లి, బోడజనంపేట, వానమోనిగూడెం, పెద్దరేవల్లి, తిరుమలగిరి, తండాలు, గంగాపూర్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయని సర్పంచులు తెలిపారు. కంకర వేసి పనులు నిలిపివేయడంతో ప్రయాణికులు, విద్యార్థులు, గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

**మద్యం దుకాణాలు, అంగన్‌వాడీలపై అభ్యంతరాలు...**

తహసీల్దార్ కార్యాలయం వెనుక హోల్‌సేల్, రిటైల్ మద్యం దుకాణాలు ఉండటంతో ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఓ సర్పంచ్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న టీచర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని పలువురు సర్పంచులు ఆరోపించారు. సమావేశంలో ప్రత్యేక అధికారి కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీవో జైపాల్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టి-ఫైబర్ సేవలు

- ఆగస్టు 31లోగా ఇంటర్నెట్ ఏర్పాటు పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టి-ఫైబర్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టి-ఫైబర్ కనెక్షన్ల ఏర్పాటు ప్రక్రియను ఆగస్టు 31లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో టి-ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు అంశంపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేక ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ ఇంటర్నెట్ కనెక్షన్ల స్థానంలో టి-ఫైబర్ సేవలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖలతో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టి-ఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చేలా పటిష్ట చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుతం ఉన్న ఇంటర్నెట్ వినియోగం, అవసరమైన సామర్థ్యం తదితర అంశాలపై సమగ్ర అంచనా రూపొందించి, దానికి అనుగుణంగా టి-ఫైబర్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా అన్ని శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో సహకరించాలని ఆమె ఆదేశించారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, ఈడీఎం సందీప్, టి-ఫైబర్ ఇంటర్నెట్ మెదక్ జోనల్ మేనేజర్ ఈశ్వర్, టి-ఫైబర్ ఇంటర్నెట్ డీఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల రైతులకు రూ.500 బోనస్.. రిజిస్ట్రేషన్ తప్పనిసరి : ఏవో ప్రవీణ్ కుమార్

- ఏడు సన్న రకాలకే రూ.500 బోనస్
- సన్న వడ్లు సాగు చేసిన రైతులకు అదనపు ఆదాయం
- రిజిస్ట్రేషన్ మిస్ అయితే బోనస్ దూరం



**రామాయంపేట, ఆగస్టు 20 (జనంసాక్షి):** సన్న రకం వడ్లు సాగుచేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్వింటాల్‌కు రూ.500 బోనస్ పొందేందుకు రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. సన్న రకం ధాన్యం సాగు చేసిన రైతులు ప్రభుత్వం నిర్దేశించిన విధానంలో నమోదు చేసుకున్నప్పుడే ధాన్యం సేకరణ సమయంలో బోనస్ పొందేందుకు అర్హత ఉంటుందని తెలిపారు.

**ఏడు సన్న రకాలకే బోనస్...**
ప్రభుత్వం గుర్తించిన BPT-5204 (సాంబ మసూరి), WGL-44 (సిద్ధి), KNM-1638 (కూనారం సన్నాలు), HMT, జై శ్రీరామ్, KNM-7715, RNR-15048 (తెలంగాణ సోనా) రకాల వడ్లు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

**డీలర్ వద్దే రిజిస్ట్రేషన్...**
రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ పాయింట్‌కు వెళ్లి సన్న రకం విత్తనాల వివరాలతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. డీలర్ వద్దకు వెళ్లే సమయంలో విత్తనాల కొనుగోలు బిల్లు, రైతు మొబైల్ నంబర్ వెంట తీసుకెళ్లాలని సూచించారు. బిల్లు ఆధారంగా విత్తన రకం, రైతు వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు.

**రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి...**
సన్న రకాల ధాన్యాన్ని సాగు చేస్తున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు వెంటనే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారి సూచించారు. సెప్టెంబర్ 10 చివరి తేదీ కావడంతో చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే డీలర్‌ను సంప్రదించాలని కోరారు.
అర్హత ఉన్న రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోనస్ పొందేందుకు ఈ ప్రక్రియను పూర్తి చేయడం ముఖ్యమన్నారు. రైతులందరూ వ్యవసాయ శాఖ సూచనలను పాటించి ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.



## గద్వాల రైల్వే అభివృద్ధిపై ఎంపీ డీకే అరుణ ఆరా

**గద్వాల, ఆగస్టు 20 (జనంసాక్షి):** సికింద్రాబాద్ రైల్ నిలయంలో బుధవారం జరిగిన తెలంగాణ ఎంపీల సమీక్షా సమావేశంలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ గద్వాల జోగులాంబ రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమృత్ భారత్ పథకం కింద గద్వాల జోగులాంబ స్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. గద్వాల స్టేషన్‌లో వందే భారత్‌తో సహా ప్రధాన రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని, కోవిడ్ సమయంలో తొలగించిన స్టాప్ లను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గద్వాల జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన గద్వాల - రాయచూర్ కొత్త రైల్వేలైన్ ప్రతిపాదనను సెంట్రల్ రైల్వే బోర్డులో వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అలాగే గద్వాల నుండి హైదరాబాద్, తిరుపతి వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు రిజర్వేషన్ కౌంటర్లు, ప్లాట్ ఫామ్ ఆధునీకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలోనే తన విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ - కర్నూల్ హుంద్రీ ఎక్స్‌ప్రెస్‌కు మలక్ పేటలో స్టాప్ ఇచ్చేందుకు రైల్వే అంగీకరించిందని ఎంపీ తెలిపారు.

## ఎర్రవల్లిలో రాజీవ గాంధీ జయంతి వేడుకలు



**ఎర్రవల్లి, ఆగస్టు 20 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండల కేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి సీనియర్ నాయకులతో కలిసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల పార్టీ నాయకులు మండల పరిధిలోని వివిధ గ్రామల కార్యకర్తలు ఉన్నారు.

# రెండు రోజుల్లో కర్నె తండా లిఫ్ట్ పంపులు ప్రారంభించాలి: నిరంజన్‌రెడ్డి

- లేదంటే రైతులతో కలిసి ముట్టడిస్తాం





**వనపర్తి బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా ఎగువ ప్రాంతంలోని గిరిజన రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల్లోగా లిఫ్ట్ పంపులను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని, లేనిపక్షంలో వేలాది మంది రైతులతో కలిసి కర్నె తండా లిఫ్ట్‌ను ముట్టడించి పంపులను ప్రారంభిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖిలా ఘణపురం మండలంలోని కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.76.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కర్నె తండా లిఫ్ట్ ద్వారా దాదాపు 4,500 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు ఆరు గ్రామాలు, తొమ్మిది గిరిజన తండాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.
ఎత్తైన ప్రాంతాల్లో సాగునీటికి నోచుకోని భూములకు కృష్ణా జలాలను అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు ఎత్తిపోతల పథకాలను రూపొందించిందని చెప్పారు. అందులో భాగంగానే కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. 2022 మార్చి 8న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి శంకుస్థాపన చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు వేగంగా జరిగి దాదాపు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు.

**సబ్‌స్టేషన్ కోసం రెండేళ్ల జాప్యం...**
కర్నె తండా లిఫ్ట్ పథకంలో సబ్‌స్టేషన్ నిర్మాణం మాత్రమే పెండింగ్‌లో ఉండగా, ఇందుకోసం రూ.2 కోట్లు మంజూరు చేసి ఉంచామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. అయితే సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం దాదాపు రెండేళ్ల సమయం తీసుకుందని ఆరోపించారు. రైతుల ఒత్తిడితో వెట్‌రన్ నిర్వహించి అనంతరం పంపులను బంద్ చేశారని విమర్శించారు.
ప్రస్తుతం కృష్ణా వరదల కారణంగా సమృద్ధిగా సాగునీరు అందుబాటులో ఉందని, ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుని వెంటనే కర్నె తండా లిఫ్ట్ పంపులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పంపులను ప్రారంభించకపోతే రైతులతో కలిసి లిఫ్ట్‌ను ముట్టడించి పంపులను ప్రారంభిస్తామని హెచ్చరించారు.

**58 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోత...**
ఘణపురం బ్రాంచ్ కెనాల్ 7.3 కిలోమీటర్ల వద్ద ఉన్న ముందరి తండా మైసమ్మ చెరువును నింపి, అక్కడి నుంచి సుమారు 1.5 కిలోమీటర్ల అప్రోచ్ కెనాల్ ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని తరలించే విధంగా పథకాన్ని రూపొందించినట్లు నిరంజన్‌రెడ్డి వివరించారు. లిఫ్ట్ నుంచి సుమారు 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న డెలివరీ సిస్టర్న్ వరకు మొత్తం 58 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసేందుకు 800 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన రెండు మోటార్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గతంలో చెరువులు, కాలువలు, నీటి లభ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగునీటికి నోచుకోని ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. ఎత్తైన ప్రాంతాల్లోని గిరిజన తండాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే కర్నె తండా లిఫ్ట్ పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.
దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న గిరిజన రైతుల కలను బీఆర్ఎస్ ప్రభుత్వం సాకారం చేసిందని, అసాధ్యం అనుకున్న పనిని చేసి చూపించామని నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం మిగిలిన పనులను పూర్తి చేసి పంపులను వెంటనే ప్రారంభించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, రాళ్ల కృష్ణయ్య, సామ్యా నాయక్, జాత్రు నాయక్, పీన్యా నాయక్, గోపాల్ నాయక్, నరేష్ నాయక్, ఘణపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంసీహెచ్, మెడికల్ కాలేజీలో ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆకస్మిక తనిఖీ



మెదక్ టౌన్, ఆగస్టు 20 (జనంసాక్షి): మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు గురువారం మెదక్ ఎంసీహెచ్ ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించారు.
ముందుగా ఎంసీహెచ్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు, వైద్య సిబ్బంది అందుబాటు, మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.
అనంతరం మెదక్ మెడికల్ కాలేజీని సందర్శించిన ఎమ్మెల్యే కాలేజీ పరిసరాలు, మౌలిక వసతులు, నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌తో సమావేశమై కాలేజీలో నెలకొన్న సమస్యలు, అవసరాలు, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు.
ఆసుపత్రి, మెడికల్ కాలేజీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆకునూరులో రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు



చేర్యాల, ఆగస్టు 20 (జనంసాక్షి): చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని గురువారం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల రాజు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు తోల్ల రాజేశ్వరి, ఉడుత బాలరాజు, పెద్ద ముత్తని పోచయ్య, సూర సంపత్, తాటికొండ సుభాష్, ఏళ్ల సూర్యకాంత్, సుంకరి వీరయ్య, పొడల శివకృష్ణ, ఎస్ కే షరీఫ్, తోళ్ళ వేణు, పాల్గొన్నారు.

## పిడిఎస్‌యూ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలి

- విద్యార్థి ఉద్యమాలపై అణచివేత మంచి సంస్కృతి కాదు: అరుణోదయ విమలక్క




సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి): పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు నాటి ఉద్యమ అనుభవాలను నేటి తరానికి అందిస్తూ, సమాజంలో నెలకొన్న అసమానతలు, విద్యార్థుల సమస్యలపై మరోసారి గొంతెత్తాల్సిన అవసరం ఉందని అరుణోదయ విమలక్క అన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి మెదక్ జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగింది.
ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ, నాటి విద్యార్థి ఉద్యమాలు, పోరాటాలు, అనుభవాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు మళ్లీ కలవడం గొప్ప మార్పుకు సంకేతమన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పీడీఎస్‌యూ విద్యార్థులపై తీవ్ర నిర్బంధం కొనసాగిన రోజులను గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటాలను అణచివేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత విధానాలను వ్యతిరేకిస్తున్నామని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొండా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, 50 ఏళ్ల పీడీఎస్‌యూ ఉద్యమ ప్రస్థానం విలువైన అనుభవమని, నేటి యువత సమస్యలపై పూర్వ విద్యార్థులు అండగా నిలవాలని కోరారు. పోచబోయిన శ్రీహరి మాట్లాడుతూ పీడీఎస్‌యూ ఐదు దశాబ్దాల ఉద్యమ చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అధ్యాపకుడు అఖిల్ ప్రశ్నించడం, ఆలోచించడం నేరంగా మారకూడదని అన్నారు. వంగల సంతోష్ మాట్లాడుతూ పీడీఎస్‌యూ త్యాగాలు, పోరాటాలతో కూడిన చరిత్ర కలిగిన విద్యార్థి సంఘమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి

- రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి
- నంగునూరు మండల స్పెషల్ ఆఫీసర్ శివరంజని



నంగునూరు, ఆగస్టు 20 (జనంసాక్షి): ఎల్-నినో ప్రభావం - ప్రత్యామ్నాయ పంటల సాగు పై సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట రైతు వేదికలో మండల ప్రత్యేకాధికారిని శివరంజని ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ మార్పులు మరియు "ఎల్-నినో" పరిస్థితుల ప్రభావం వల్ల సెప్టెంబర్, అక్టోబర్ లలో మరియు వేసవి కాలంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంటుందని మండల ప్రత్యేకాధికారిని శివరంజని రైతులకు వివరించారు. తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. రైతులు బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలు, పంట గుంతలు నిర్మించుకోవాలని కోరారు. ఎల్-నినో పై రైతులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సూచన మేరకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంతోష్ రెడ్డి, నరేష్ రెడ్డి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం పై అధికారులు నామ మాత్రం గానే అవగాహన కల్పిస్తున్నారని ప్రత్యమ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు చెబుతున్న విత్తనాల సరఫరా చేయడంలోవిఫలమవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శనిగరం స్వాతి, ఎంపిడిఓ ప్రభాకర్ రావు, ఎంపీ ఓ, ఏఈఓ లు, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



గోపాలపేట ఆగస్టు:20 (జనంసాక్షి): గోపాల్‌పేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మంద సత్యశీల రెడ్డి సారథ్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు శివన్న, రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీ కొంకి వెంకటేష్, జిల్లా యువజన కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ కొంకి రమేష్, ధీరమల్లు యాదవ్, బ్యాదరి శాంతయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లా ఘనపూర్, ఆగస్టు 20 (జనంసాక్షి): భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను స్థానిక మండల కేంద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె.కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ క్యామ నవనీత,సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు, జిల్లా దిశ కమిటీ సభ్యులు రవి నాయక్, లచ్చి రెడ్డి,వార్డు సభ్యులు లింగ స్వామి, రామకృష్ణ రెడ్డి,రాములు నాయక్, నరేందర్, నారాయణ, మ్యాతరీ రాములు, తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేట, ఆగస్టు 20 (జనంసాక్షి): గోపాల్‌పేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధాకర్ రావు, గోవర్దన్ రెడ్డి, పార్థసారథి, పుల్లయ్య, శివగౌని నాగన్న గౌడ్, రమేష్, అశోక్ రెడ్డి, బాలరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్వకుర్తి,ఆగస్టు20,(జనంసాక్షి): కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి,ఉపాధ్యక్షుడు షానవాజ్‌ఖాన్,బ్లాక్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు కొల్లోజు రాజేష్‌కుమార్,చిత్తరి శ్రీనివాస్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఏయాఖాన్, నాయకులు మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, వర్కలాభాస్కర్‌రెడ్డి,దామోదర్‌రెడ్డి,తదితరులుపాల్గొన్నారు.



నవాబ్‌పేట, ఆగస్టు 20 (జనంసాక్షి): మండల కేంద్రంలో భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి (సద్భావనా దివస్) వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ వేడుకల్లో నవాబ్‌పేట కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చేర్యాల, ఆగస్టు 20 (జనంసాక్షి): భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాలు చేర్యాల పట్టణంతో పాటు అన్ని గ్రామాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మహాధర్నాతో దద్దరిల్లిన నాగర్‌కర్నూల్

- హామీలు అమలు చేయని సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- కళ్యాణలక్ష్మి-షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి
- పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తాం
- కేసీఆర్ హయాంలోని సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి
- సీఎం సొంత జిల్లా నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని వ్యాఖ్య








**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** కళ్యాణలక్ష్మి–షాదీముబారక్ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించిన మహాధర్నా భారీగా జరిగింది. మినీ ట్యాంక్‌బండ్ కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావడంతో పట్టణంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కొత్త పథకాలు అమలు చేయడం సంగతి పక్కన పెడితే, ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను కూడా సక్రమంగా కొనసాగించలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు.

**కళ్యాణలక్ష్మి-షాదీముబారక్‌పై నిర్లక్ష్యం తగదు...**

పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈ పథకాల విషయంలో ప్రభుత్వం సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఆడపిల్లల తల్లిదండ్రులు అప్పులు చేసి వివాహాలు చేసుకునే పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం వారికి ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. అలాంటి పథకాలను నిర్వీర్యం చేయకుండా సకాలంలో నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. తులం బంగారం ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఆ హామీ సంగతి పక్కనపెడితే, గతంలో ఉన్న కళ్యాణలక్ష్మి పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది" అని ఆయన విమర్శించారు.

**కేసీఆర్ సంక్షేమ పథకాలను కొనసాగించాలి...**

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు, వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం వంటి పథకాలు ప్రజలకు అండగా నిలిచాయని అన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయ కక్షలకు తావివ్వకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

**ప్రశ్నించకపోతే మిగిలిన పథకాలు కూడా రద్దు చేస్తరు...**

ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోతే ఇప్పటికే ఉన్న మరిన్ని సంక్షేమ పథకాలను కూడా రద్దు చేసే ప్రమాదం ఉందని మర్రి జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలు చైతన్యవంతులై తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల నోట్లో మట్టి కొట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరించరాదని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**సీఎం సొంత జిల్లా నుంచే పతనం ప్రారంభమైంది...**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నుంచే కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని మర్రి జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహాధర్నాకు పిలుపునిచ్చిన వెంటనే పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడం ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనమన్నారు. ఆడబిడ్డల సంక్షేమానికి సంబంధించిన పథకాలను నిర్వీర్యం చేస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఎమ్మెల్యే తీరుపై విమర్శలు...**

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో రాజకీయ వివక్ష చూపుతున్నారని మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో వారు ఏ పార్టీకి చెందిన వారో చూడటం సరికాదన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పేదలను కూడా రాజకీయ పార్టీలతో ముడిపెట్టి తొలగిస్తున్నారని ఆరోపించారు. పేదల పొట్ట కొట్టే చర్యలకు పాల్పడితే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**పేదలకు బువ్వ పెట్టడం పాపమా?**

నాగర్‌కర్నూల్ ప్రజలకు బుక్కెడు బువ్వ పెట్టడం కూడా పాపమా అని మర్రి జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆకలితో అలమటించే పేదల కోసం 'మర్రి అన్న క్యాంటీన్' ద్వారా భోజనం అందిస్తుంటే మున్సిపాలిటీ ద్వారా నోటీసులు ఇప్పించడం తగదని విమర్శించారు. పేదల కోసం తన సంపాదనలో నుంచి ప్రతి నెలా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేస్తున్నానని తెలిపారు. పేదలకు భోజనం అందించే కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడం సమంజసం కాదన్నారు.

**24 గంటల విద్యుత్ కోసం మరో పోరాటం....**

రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం వ్యవసాయంతో పాటు గృహ విద్యుత్‌లోనూ కోతలు విధిస్తున్నారని విమర్శించారు. 24 గంటల విద్యుత్ సరఫరా కోసం త్వరలోనే మరో ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు.

**పోలీసుల తీరుపై ఆగ్రహం...**

మహాధర్నా సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిపై కూడా మర్రి జనార్దన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా ప్రాంగణంలో కార్యకర్తలను పక్కకు జరపడం, అనంతరం ర్యాలీని నియంత్రించేందుకు ప్రయత్నించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు.

**ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉద్రిక్తత...**

మహాధర్నా అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి తరలివెళ్లగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్యాలయం గేటు వద్ద కూడా నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రజల తరఫున అధికారులకు వినతిపత్రం అందించేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం ఎందుకని మర్రి జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. అనంతరం పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యాలయ ప్రాంగణంలోకి చేరుకుని బైఠాయించారు. కళ్యాణలక్ష్మి–షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

**ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం...**

పేదల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున మరింత బలమైన ఉద్యమాలు చేపడుతుందని మర్రి జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి––షాదీముబారక్‌తో పాటు కేసీఆర్ హయాంలో అమలైన అన్ని సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం తమ బాధ్యత అని, పేదలు, మహిళలు, రైతులు, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

